ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 7 ఆగస్టు 2024



సాగర్ వద్ద యువత సెల్ఫీ

మగ్గం మురిసేనా?

- పూర్వ వైభవంపై నేతన్నల ఆశలు
- చేనేత దినోత్సవం సందర్భంగా నేడు చీరాలకు చంద్రబాబు
- నేతన్నల కుటుంబాలతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ముఖాముఖి
- కులవృత్తిని వీడలేక.. ప్రోత్సాహం దొరక్క ఇక్కట్లలో నేతన్నలు

ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన చేనేత మగ్గం ఆధునికీకరణ, యాంత్రీకరణలతో కుదేలైంది. తన మేథస్సుతో ప్రపం చస్థాయి గుర్తింపు పొందిన నేతన్న నేడు బతుకు భారంగా మారింది. దారం పోగులతో వస్త్రాలను అత్య ద్భుతంగా తీర్చిదిద్దే మగ్గం సంక్షోభంలో చిక్కుకు పోయింది. స్వయం పోషకంగా తరతరాలుగా జీవనం సాగిస్తున్న చేనేత రంగం చేయూత కరువై అల్లాడిపోతోంది. గతం ప్రభుత్వ విధానాలతో కునారిల్లిపోయిన దశలో కూటమి ప్రభుత్వంపై నేతన్నలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నేతన్న ఇంతటి సంక్షో భంలో ఉన్న సమయాన బుధవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు చీరాలకు రానుండడంతో మగ్గానికి పూర్వ వైభవం తెచ్చే విధంగా వరాల జల్లు కురిపిస్తారని కార్మి కులు ఆశతో ఉన్నారు. నేతన్నల కుటుం బాల స్థితిగతులపై సీఎం చంద్రబాబు స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి తెలు సుకోనున్నారు. తర్వాత వారితో సమా వేశమై ఇక్కట్లను విని చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చే పాలసీని ప్రకటించనున్నారని సమాచారం.

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిరంగమైన చేనేత సంక్షోభంలో చిక్కి విలవిలలాడుతోంది. చేయూత కరువై అల్లాడిపోతోంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిపుణులైన చేనేత కార్మికులు కష్టనష్టాలకోర్చి చేనేత రంగాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే పవర్ లూమ్ ధాటికి నేతన్నల చే'మగ్గం' విరిగిపోతోంది. రెక్కాడితేగాని డొక్కాడని నేతన్నల దుస్థితిని గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో చేనేతరంగం మునుపెన్నడూ లేనంతటి సంక్షోభంలో కూరుకుపోయింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 50 వేల కుటుంబాల పరిస్థితి ప్రమాదంలో పడింది. బాపట్ల జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాల తర్వాత ఎక్కువమంది ఆధారపడిన రంగం చేనేత పరిశ్రమ. జిల్లా పరిధిలో ఐలవరం, రేపల్లె, భట్టిప్రోలు, వేటపాలెంతో పాటు చీరాలలో అత్యధిక సంఖ్యలో చేనేత కార్మికులు గతంలో ఉండేవారు. ఐదేళ్ల క్రితం వరకు జిల్లాలో దాదాపు 17,000 వరకు మగ్గాలుండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 8,000కు పడిపోగా ఒక్క చీరాలలో 6,000 వరకు ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ రంగం నుంచి వైదొలగిన ఎంతోమంది కుటుంబ పోషణకై బేల్దారి కార్మికులగా, ఆటో డ్రైవర్లుగా మారిపోయారు. మరికొందరు కులవృత్తిపై మమకారం వదులుకోలేక, ప్రభుత్వం నుంచి సహకారం అందక అంపశయ్యమీద నెట్టుకొస్తుంటే మరెంతో మంది అప్పుల బాధతో తనువు చాలించారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రావడంతో తమకు ఊపిరి తీసుకునే వెసులుబాటు వస్తుందన్న ఆశతో నేతన్నలు ఎదురు చూస్తున్నారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో చేనేత రంగానికి ఎన్నో రాయితీలను అందించింది. ముడిసరుకుపై రాయితీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ తదితరాలతో అప్పట్లో నేతన్నలకు, సంఘాలకు ప్రభుత్వం ఊతమిచ్చింది. దీని వల్ల ఒక్కో చేనేత సంఘానికి దాదాపు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరేది. పట్టు చీరలు నేసే నేతన్నలకు ముడి సరుకుపై కిలోకు రూ.200 వరకు రాయితీని అందించేది. దీనివల్ల ఏడాదికి ఒక్కో కార్మికుడికి సగటున దాదాపు 30,000 వరకు ప్రయోజనం దక్కేది.



హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ, కలెక్టర్, ఎస్పీ

చేనేత కార్మికుడు తన ఆదాయంలో 8 శాతం పొదుపు చేసుకుంటే అంతేమొత్తాన్ని ప్రభుత్వం చెల్లించి వారికి అండగా నిలిచింది. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే అవన్నీ నిలిపేసి నేతన్న నేస్తంతో చేనేత రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీసింది. గడచిన ఐదేళ్లలో ముడిసరుకు ధర రెట్టింపైనా జగన్ ప్రభుత్వం దృష్టి సారించిన దాఖలాలు లేవు. నేతన్న నేస్తం పేరుతో నూటికి పది మందికి తాయిలాలు పంచుతూ అదే నేతన్నల సమస్యలన్నింటికీ పరిష్కారమన్న చందంగా వ్యవహరించింది. చితికి పోతున్న చేనేతను సంరక్షించేందుకు టీడీపీ యువనేత నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళ గిరిలో కొంత ప్రయత్నం చేశారు. అధికారం లేకపోయినా సొంత నిధులతో నేతన్నలకు అధునాతన యంత్ర సామాగ్రిని అందించడంతో పాటు, మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మంగళగిరిని నమూనాగా తీసుకుని చేనేతకారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొం దించే ప్రయత్నం చేశారు. కార్పొరేట్ మార్కె టింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్‌షిప్ తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైన, ప్రత్యేకించి ప్రస్తుతం మంత్రిగా ఉన్న లోకేశ్‌పైన నేతన్నలు ఆశలు పెంచుకున్నారు. అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ పరంగా సమగ్ర కార్యక్రమాన్ని అమలు చేసి చేనేత సంరక్షణ చేపట్టాలని నేతన్నలు వేడుకుంటున్నారు.

వైసీపీ వంచన

అసలే అంతంత మాత్రంగా ఉన్న చేనేత రంగాన్ని ఐదేళ్ల వైసీపీ పాలనతో మరింతగా సంక్షోభంలో కూరుకుపోయింది. మగ్గం ఉన్న చేనేత కుటుంబాలకు అన్నింటికీ ప్రోత్సాహకం అందిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం ఆ తర్వాత మాటమార్చింది సొంత మగ్గం ఉంటేనే అనే షరతు చేర్చి నేతన్నలను నిలువునా వంచించింది. కూలి మగ్గాలపై ఆధారపడి పొట్టపోసుకుంటున్న వేల మంది నేతన్నలను వైసీపీ దగా చేసింది. ముడిసరుకుకు ఇచ్చే రాయితీని ఎత్తివేశారు. సహకార సొసైటీల ఉద్దేశాన్ని నీరుగార్చి భ్రష్టుపట్టించారు. వైసీపీ ప్రభుత్వం చేనేత రంగంపై అవలంబించిన వైఖరి వల్ల ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కులవృత్తిని వదులుకోలేక కుటుంబపోషణ భారమై పంటి బిగువున బతుకీడుస్తున్న వారు ఎందరో ఉన్నారు.

పవర్‌లూమ్‌తో కుదేలు

1985లో నూతన జౌళి విధానంతో మొదలైన చేనేత పతనం ఇప్పుడు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరింది. పవర్ మగ్గాలు, కాంపోజిట్ మిల్లుల ధాటికి తట్టుకోలేక చిగురుటాకులా వణికిపోతోంది. చేనేత సంరక్షణ కోసమంటూ వస్త్రాల ఉత్పత్తిని రిజర్వు చేసినా వాటిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా మార్కెట్లో చేనేత ఉత్పత్తుల స్థానం మొత్తాన్ని పవర్‌లూమ్ ఆక్రమించింది. దీంతో చేనేతకు ఉపాధి అనేదే లేకుండా పోయింది. వైసీపీ హయాంలో చేనేత పేరుతో మార్కెట్లోకి వచ్చిన పవర్‌లూమ్ ఉత్పత్తులను కొన్న వినియోగదారులు ఘోరంగా మోసపోయారు. మోసపోయిన వినియోగదారులు చేనేతేదో, నకిలీ ఏదో గుర్తించలేక చేనేత వస్త్రాలను కొనడమే మానేసే పరిస్థితికి వచ్చారు. ఫలితంగా హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, ముంబై, ఢిల్లీల్లోని అతిపెద్ద చేనేత మార్కెట్లన్నీ తమకు చేనేత వస్త్రాలు వద్దని బోర్డులు పెట్టాయి. ఫలితంగా రెండేళ్లుగా చేనేత ఉత్పత్తులన్నీ ఉత్పత్తిదారుల దగ్గరే ఆగిపోయి, గుట్టలుగా పేరుకుపోయాయి. మాస్టర్ వీవర్లు ఉత్పత్తిని నిలిపివేశారు. కార్మికులకు పని కల్పించడం ఆపేశారు. దీంతో నేతన్నల ఆకలి పస్తులతో, అప్పుల తిప్పలతో అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో వారంతా వృత్తిని వదిలి ఇతర పనులకు వెళ్లిపోయారు.

నకిలీ ఉత్పత్తులకు ఆప్కో ఊతం

చేనేత ఉత్పత్తులకు రక్షణ, ప్రోత్సాహం కల్పించాల్సిన ప్రభుత్వాలే ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించాయి. చేనేత పేరుతో చలామణి అవుతున్న నకిలీ వస్త్రాల ఉత్పత్తికి ఊతమిచ్చేలా ఆప్కో పవర్‌లూమ్ వస్త్రాలను చేనేత వస్త్రాల పేరుతో విక్రయిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాంతో పవర్ లూమ్ ఉత్పత్తిదారులు చెలరేగిపోయేవారు. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న ప్రభుత్వాలు పవర్‌లూమ్ విషయంలో కొంతమేర అప్రమత్తంగా ఉన్నాయి. దీంతో బెంగళూరు, చెన్నై, శేలంలలో మగ్గాలు పెట్టి అక్కడి నుంచి తెచ్చి ఇక్కడ విక్రయించేవారు. వైసీపీ ప్రభుత్వం పవర్‌లూమ్ విషయాన్ని పూర్తిగా వదిలేయడంతో నేరుగా రాష్ట్రంలోనే పవర్‌మగ్గాలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, మంగళగిరి సహా అనేక ప్రాంతాల్లో పవర్ మగ్గాలు పెట్టి, అక్కడే భారీగా ఉత్పత్తి చేసి చేనేత వస్త్రాలుగా మార్కెట్లోకి వదిలేస్తున్నారు. ఆప్కోలో నకిలీ వస్త్రాల విక్రయంతో పాటు, పవర్ మగ్గాలను నియంత్రించాలన్న డిమాండ్ కూటమి ప్రభుత్వం ముందుంది.

చేనేతకు అన్ని విధాల పెద్దపీట

చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

చీరాల: వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి వస్తుంటే చెట్లు కొట్టేవారని, పరదాలు కట్టేవారని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని చెట్లు కొట్టడంలేదు.. పరదాలు కట్టడం లేదని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వేటపాలెం మండలం కొణిజేటి చేనేత పురి, చీరాల మండలం జాండ్రపేట ప్రాంతాల్లో పర్యటించి నేతన్నల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చేనేత రంగానికి పూర్వవైభవం సీఎం చంద్రబాబు, ఎన్డీఏ ప్రభుత్వంతో సాధ్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం నిర్వీర్యమైందన్నారు. సంక్షేమ పథకాలతో నేతన్నల అభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టి పెద్దపీట వేస్తుందన్నారు.



చేనేత మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సవిత


ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సవిత

చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చంద్రబాబు పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ఏర్పాట్లను మంత్రి ఎస్. సవిత మంగళవారం పరిశీలించారు. చీరాల పరిధిలోని జాండ్రపేటలో సీఎం సందర్శించే నేతన్నల గృహాలను పరిశీలించారు. అనంతరం వేటపాలెం మండల పరిధిలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఐటీసీ శాండ్రిజ్ అతిథి గృహంలో ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య, ఎస్పీ తుషార్ డూడీ, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, చీరాల గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరి సునీత, హ్యాండ్లూమ్ కమిషనర్ రేఖారాణి తదితరులతో కలసి చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా చెట్లను నరకడం, స్తంభాలను తొలగించడం వంటివి చేయవద్దని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు.

చంద్రబాబు పర్యటన ఇలా...

బుధవారం మధ్యాహ్నం 3:35కు వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జాండ్రపేటలోని బట్టవీరన్న అండ్ బీరకనాగయ్య హైస్కూల్‌కు 3:50కు వస్తారు. అక్కడ జరిగే చేనేత దినోత్సవంలో పాల్గొననున్నారు. తొలుత నేత కార్మికుల ఇళ్ల సందర్శనతో పాటు అక్కడే ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను చంద్రబాబు తిలకించనున్నారు. నేతన్నలతో ముఖాముఖిలో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడతారు. ఐదేళ్లలో వారు పడిన ఇబ్బందులు, ఆ పరిస్థితి నుంచి వారిని బయటపడేయడానికి ప్రభుత్వం ఏం చేస్తే బాగుంటుందనే అంశంపై నేతన్నల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. సాయంత్రం 5:30కు జాండ్రపేటలోని హైస్కూల్ ప్రాంగణం నుంచి రోడ్డుమార్గంలో 5:35కు తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని తిరుగు పయనం కానున్నారు.

చేనేతను కాపాడాలి



వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో చేనేత కార్మికులకు పనే లేకుండా పోయింది. ఆరు నెలలుగా పని లేక, పూట గడిచే పరిస్థితి లేక అనేక మంది అల్లాడిపోతున్నారు. కూలీలు కూడా సగానికి సగం తగ్గించారు. చేనేతను చంపేసిన పాపం ప్రభుత్వానిదే. ఇదే పరిస్థితి కొనసాగితే ఆకలి చావులు జరిగే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేనేతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి.

- జీ. సుబ్బారావు, చేనేత మిత్రమండలి రాష్ట్ర నేత

సాగర్ నుంచి.. సాగరానికి..

- పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ ప్రవాహం
- ఆల్మటి నుంచి నిండు కుండల్లా జలాశయాలు
- పులిచింతల నుంచి నేడు 3 లక్షల క్యూసెక్కుల విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మ ఉప్పొంగుతోంది. కొద్ది రోజులుగా భారీగా వస్తున్న వరదతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండాయి. వడివడిగా కృష్ణమ్మ సాగరం దిశగా పరుగులిడుతోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ సాగరం వడికి చేరుకునేందుకు పోటెత్తుతోంది. ఆల్మట్టి నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు ఉన్న ప్రాజెక్టులన్నింటిని దాటుకుంటూ కృష్ణమ్మ సాగరం చెంతకు చేరేందుకు పరుగులు పెడుతోంది. రెండు రోజుల్లో ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద వచ్చి చేరనుంది. కృష్ణానది ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదిపై ఉన్న జలాశయాలన్నీ జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం.. నాగార్జున సాగర్.. పులిచింతల.. ప్రకాశం బ్యారేజ్‌లలో నీటి నిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలకు మంగళవారం 529 టీఎంసీలకు చేరింది. జలాశయాల్లోకి నిలకడగా వరద వచ్చి చేరుతుండటంతో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్‌కు వరద ప్రవాహం కొన సాగుతోంది. ఆల్మటి నుంచి పులిచింతల వరకు ఉన్న ప్రాజెక్టుల గేట్లు తెరిచి ఉంచారు. శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం కొంత మేర వరద ప్రవాహం తగ్గింది. శ్రీశైలం జలాశయానికి 3,70,589 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా పోతిరెడ్డిపాడుకు 4,02,578 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి నుంచి 2,06,607, తుంగభద్ర నుంచి 55,586, నారాయ ణపూర్ నుంచి 2,08,540, జూరాల నుంచి 2,74,314 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ	ప్రస్తుత నీటి నిల్వ	వస్తున్న వరద నీరు	విడుదల చేస్తున్న నీరు
	టీఎంసీలలో	టీఎంసీలలో	క్యూసెక్కుల్లో	క్యూసెక్కుల్లో
ఆలమట్టి	123.08	86.35	3,02,660	2,06,607
నారాయణపూర్	33.58	27.64	2,08,540	2,08,540
జూరాల	9.66	4.95	4,014	27,579
తుంగభద్ర	105.78	102.35	84,696	55,586
శ్రీశైలం	215.81	204.35	3,70,589	4,02,578
సాగర్	312.05	298.59	3,55,369	3,55,369
పులిచింతల	45.77	42.16	3,70,632	55,883
ప్రకాశం బ్యారేజ్	3.07	2.28	6,632	11,157

సాగర్ 22 గేట్లు తెరిచారు..

నాగార్జున సాగర్ 22 క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల నుంచి 3,09,276 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27,973 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 8,298, ఎడమ కాల్వకు 8,022 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులకు 585.30 అడుగులకు చేరింది.

పులిచింతలకు పోటెత్తుతోన్న వరద

సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద వస్తుండటంతో జలకళను సంతరించుకుంది. మంగళవారం సాయంత్రం ప్రాజెక్టుకు 3,70,632 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పులిచింతల మూడు గేట్లు 2.5 మీటర్ల ఎత్తి ప్రకాశం బ్యారేజ్‌కు 50,283 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 5,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం పులిచింతల గేట్లు మొత్తం తెరిచి మూడు లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని ప్రకాశం బ్యారే జ్‌కు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ పూర్తి స్థాయి నీటి మట్టం 72.6 అడుగులు కాగా 54.05 అడుగులకు నీటి మట్టం చేరింది. నేడు బ్యారేజ్‌కు భారీగా వరద చేరనుంది.

వరద ప్రమాద హెచ్చరిక

గుంటూరు(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ డ్యాం నుంచి భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతాలకు యంత్రాంగం ప్రమాద హెచ్చరికని జారీ చేసింది. మంగళవారం మధ్యాహ్నానికే సాగర్ నుంచి 3,37,249 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నీరు బుధవారం ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరుకో వచ్చని, ఇంకా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు తదితర మండలాల ప్రజలు నదీ తీర ప్రాంతం వద్దకు వెళ్లరాదన్నారు. పిల్లలు, పశువులను కూడా వరద నీటి వద్దకు తీసుకెళ్లొద్దని గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు.

పల్నాడు జిల్లాలో వింత జ్వరాలు!

- రోగుల్లో పాదాలు, చేతుల వాపు
- జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు
- జ్వరం తగ్గినా వదలని కీళ్ల నొప్పులు
- చికున్ గన్యా కాదంటున్న డీఎంహెచ్‌వో
- ఆర్బో వైరస్ కావచ్చంటున్న వైద్యులు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 6 : గుంటూరు జిల్లాలో వింత జ్వరాలు ప్రబలాయి. ఊళ్లకు ఊళ్లు ఈ వింత జ్వరాల బారినపడుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాచర్ల, పల్నాడు తదితర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఈ జ్వరాలు విస్తృతంగా ప్రబలాయి. ఇవి వైరల్ ఫీవర్లు కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే.. ఇంటిల్లిపాదీ వీటికి గురౌతున్నారు. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. పాదాలు, చేతులు, చేతివేళ్ల వాపనకు గురై తీవ్రంగా వేధిస్తున్నాయి. చేతి వేళ్లను మడవ లేకపోతున్నారు. పాదాల వాపుతో రోగులు సరిగా నడవ లేకపోతున్నారు. మూడు, నాలుగు రోజుల్లో జ్వరం తగ్గుతున్నా, కీళ్ల నొప్పులు మాత్రం పలువురిని వదలటం లేదు. మెజార్టీ రోగుల్లో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్లు చెబుతున్నారు.



చేతుల వాపులు (నమూనా చిత్రం)

చికున్ గన్యా జ్వరాలు కాదు...

జ్వర ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఇవి చికున్ గన్యా జ్వరాలను తలపిస్తున్నా.. వైద్య పరీక్షల్లో మాత్రం ఇది నిర్ధారణ కావడం లేదు. ఆర్బో తరగతికి చెందిన వైరస్‌లే ఈ జ్వరాలకు కారణమని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. జిల్లాలో ప్రబలిన వింత జ్వరాలపై గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మిని వివరణ కోరగా, వీటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రోగులు మూడు రోజుల్లోనే కోలుకుంటున్నట్లు తెలిపారు. సీరియస్ కాంప్లికేషన్స్ లేవన్నారు. రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షిస్తే, అవి చిగున్ గన్యాగా నిర్ధారణ కావడం లేదని డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. వైరస్ నిర్ధారణ కోసం సీరం నమూనాలను పూణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపాలని భావిస్తున్నారు.

ఆరు వారాల పాటు కీళ్లనొప్పులు

ఇవి కొత్త జ్వరాలు కావడంతో పలువురు రోగులు ఆందోళనతో గుంటూరు నగరంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో చేరి చికిత్సలు పొందుతున్నారు. 'ఈ వైరల్ ఫీవర్లు ప్రమాదకరం కాదు. సింప్టమ్యాటిక్ ట్రీట్‌మెంట్‌తోనే తగ్గుతున్నాయని' సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ వైవీఎస్ ప్రభాకర్ తెలిపారు. 'కొంత మంది రోగుల్లో జ్వరం తగ్గాక రెండు వారాలకు పైగా కీళ్ల నొప్పులతో బాధపడుతుంటే మాత్రం తక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ ఇస్తే వారికి ఉపశమనం లభిస్తున్నట్లు' పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆరు వారాల్లో కీళ్ల నొప్పులు పూర్తిగా తగ్గిపోతున్నట్లు ఆయన వెల్లడించారు.

జిరాక్సులు సరే.. ఒరిజినల్స్?

- పొంతనలేకుండా అధికారుల సమాధానాలు
- తహసీల్దారు కార్యాలయంలో కనిపించని ప్రొజెక్టర్



కార్యాలయంలో డీవీసీ కాలనీ ఫైల్స్

పొన్నూరు టౌన్, ఆగస్టు 6: తహసీల్దార్ కార్యాలయంలో డీవీసీకాలనీకి చెందిన ఫైల్ మాయం కలకలం సృష్టించగా.. మంగళవారం అధికారులు ఆగమేఘాలపై దానిని వెతికి బయటపెట్టారు. అయితే అధికారులు వెతికితెచ్చిన ఫైల్‌లో 650 ఒరిజనల్ పట్టాల స్థానంలో జిరాక్సులు ఉన్నాయి. ఒరిజినల్ ప్రతులు ఉండాల్సిన ఫైల్‌లో జిరాక్సులు ఎలా వచ్చాయి, ఒరిజినల్ పట్టాలు ఎక్కడ ఉన్నాయనే విషయంలో అధికారులు పొంతనలేకుండా సమాధానాలిస్తున్నారు. డీవీసీ కాలనీ ప్లాట్ల విషయంలో దశాబ్దకాలంగా సీబీసీఐడీ విచారణ జరుగుతుంది. ఈ క్రమంలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన ఫైల్ మాయమవడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఒకరు సీబీసీఐడీ కార్యాలయంలో ఉన్నాయని, మరొకరు కలెక్టరేట్‌లో ఉన్నాయని చెప్పడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 1998లో దేవదాయశాఖకు చెందిన 35 ఎకరాలు సేకరించి 657 మంది పేదలకు 2 సెంట్ల చొప్పున నివేశన స్థలాలు పంపిణీ చేయగా వాటిలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దశాబ్దం నుంచి సీబీసీఐడీ విచారణ జరుగుతుండగా పట్టణానికి చెందిన ఓ మహిళ 15 రోజుల క్రితం తన నివేశన స్థలానికి సంబంధించిన ఒరిజినల్ పట్టా పోయిందని నకలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఫైల్ మాయం విషయం బహిర్గతమైంది. ఈ క్రమంలో 15 రోజుల నుంచి కనపడని ఫైల్ ఆరోపణలు వచ్చిన వెంటనే జిరాక్సులు కనిపించడం విశేషం. అయితే ఒరిజినల్ పట్టాలు ఉంటేనే అసలు లబ్ధిదారుల వివరాలు తెలుస్తాయని జిరాక్సులతో గుర్తించడం కష్టమని కొందరు అధికారులే వెల్లడిస్తున్నారు.

ఓ ప్రొజెక్టర్ మాయం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిబ్బంది శిక్షణ కోసం అధికారులు పాఠశాల నుంచి రెండు ప్రొజెక్టర్లను తెప్పించారు. ఎన్నికల అనంతరం వాటిని తిరిగి ఇవ్వమని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరారు. దీంతో అవి మాయమైన విషయం తెలిసింది. దీంతో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి మెమో దాఖలు చేయడంతో ఓ ప్రొజెక్టర్‌ను తెచ్చి అప్పగించారు. బ్రాహ్మణకోడూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రొజెక్టర్ ఆచూకీ నేటికి తెలియడం లేదు. ప్రభుత్వ ఆస్తులు రికార్డులు పర్యవేక్షించాల్సిన అధికారులు, సిబ్బంది అలసత్వం, బాధ్యత రాహిత్యమే ఈ సంఘటనలకు కారణమని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. డీవీసీ కాలనీ పట్టాల జిరాక్సుల ఫైల్ లభ్యమైందని, ఒరిజినల్ పట్టాల విషయంలో సమాచారం లేదని ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు.

ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UMXeSxkలో చదవండి.

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్



హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

స్పాట్ అడ్మిషన్స్: అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 10-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ASPI2

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 20-08-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RMKSP4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

బరువెక్కిన హృదయంతో...



గతంలో కుదుర్చుకున్న పలు చిత్రాల ఒప్పందం కారణంగా బిగ్‌బాస్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నట్టు అగ్రనటుడు కమల్ హాసన్ ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. 'ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రయాణం నుంచి ఒక చిన్న విరామం తీసుకుంటున్నాననే విషయాన్ని బరువెక్కిన హృదయంతో ప్రకటిస్తున్నాను. బిగ్ బాస్ కారణంగానే మీ ఇళ్ళకు వచ్చి మిమ్మల్ని కలుసుకునే భాగ్యం నాకు లభించింది. మీరు అందించిన ఉద్వేగపూరిత, ఉత్సాభరిత మద్దతు, ఆదరణ కారణంగా బిగ్‌బాస్ తమిళ సీజన్ దేశంలోనే ఉత్తమ టెలివిజన్ రియాలిటీ షోలలో ఒకటిగా మారింది. ఒక ప్రెజెంటర్‌గా నేను వ్యక్తిగతంగా నేర్చుకున్న అనేక విషయాలను నిజాయితీగా మీతో పంచుకున్నాను' అని కమల్ హాసన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి (చెన్నై)

క్రేజీ ప్రాజెక్ట్‌కు 9న శ్రీకారం



జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం ఈ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. 'కేజీఎఫ్' చిత్రంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమా గురించి నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ యలమంచి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'శుక్రవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా సినిమాను ప్రారంభిస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలవుతుంది. ఎన్టీఆర్ అక్టోబర్ నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ లోపు ఆయన లేని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. హీరోయిన్ ఎవరన్నది ఇంకా ఎంపిక చేయలేదు' అని చెప్పారు. ప్రస్తుతం తను నటిస్తున్న 'వార్ 2' చిత్రం షూటింగ్‌ను ఈలోగా పూర్తి చేసి, ప్రశాంత్ నీల్ చిత్రం మీద పూర్తిగా దృష్టి పెట్టనున్నారు ఎన్టీఆర్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మించనున్నారు. పూర్తి వివరాలను చిత్ర ప్రారంభోత్సవం రోజున వెల్లడిస్తారు.

ఇండస్ట్రీ ఏ ఒక్క ఫ్యామిలీ సొత్తు కాదు



'వీళ్ల తప్ప మరెవరూ ఉండరు' అంటూ మెగా ఫ్యామిలీపై చేస్తున్న విమర్శలపై నటుడు నాగబాబు స్పందించారు. సోమవారం 'కమిటీ కుర్రోళ్లు' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ "సినిమా ఇండస్ట్రీలో ఎటు చూసినా మెగా ఫ్యామిలీదే ఆధిపత్యం.. కొందరి ఎదుగుదలను ఆ ఫ్యామిలీ అడ్డుకుంటోందని అని ఎంతో మంది సార్లు అనడం విన్నాను. అలా అనడం ముమ్మాటికీ తప్పు. మాకు అలాంటి ఫీలింగ్ లేదు. ఇండస్ట్రీ మా తాత సొత్తు కాదు.. మా నాన్న సామ్రాజ్యం కాదు. అలాగే నందమూరి ఫ్యామిలీది కాదు, అక్కినేని కుటుంబానిది కాదు. ఇండస్ట్రీ అందరికీ చెందినది. సినిమా కుటుంబ నేపథ్యం ఏమీ లేకపోయినా అడవి శేష్ వంటి హీరోలు తమ టాలెంట్‌తోనే పైకి వచ్చారు. వారికి ఎవరూ అడ్డం పడలేదుగా. ఇప్పుడు 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంలో నటిస్తున్న వాళ్లు ఏ రేంజ్‌కి వెళతారో ఎవరన్నా ఊహించగలరా! ఈ రోజు సినిమాలే కాదు.. ఆర్టిస్టుల కోసం ఎన్నో ఓటీటీ వేదికలు ఉన్నాయి. మంచి కంటెంట్ ఉన్న సినిమాకి ట్రై చేయండి. రెగ్యులర్ సినిమాల్లో రొటీన్ క్యారెక్టర్స్ కోసం ప్రయత్నించకండి" అని చెప్పారు.

'దేవర' నటుడికి అరుదైన వ్యాధి



మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో.. 'దసరా', 'రంగబలి' వంటి సినిమాలలో ప్రతినాయక పాత్రలతో తెలుగులోనూ పాపులర్ అయ్యారు. ఇప్పుడు ఆయన ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర' లోనూ విలన్‌గా కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో.. తనకు అటెన్షన్ డెఫిసిటీ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏ.డీ.హెచ్.డీ) ఉందని తెలిపారు. ఈ వ్యాధి ఉండే వారు ఇతరుల కంటే ప్రత్యేకంగా కనిపించడానికి ప్రయత్నిస్తారని.. అయితే ఇందుకు తానేం బాధపడట్లేదని.. దీన్నే పాజిటివ్ క్వాలిటీగా భావిస్తా అని చెప్పారు.

సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!



సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెట్టు కూలిపోయిందనే విషయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో రోజంతా ఇదే విషయం హాట్ టాపిక్‌గా మారింది. కాగా అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్ ఈ సినిమా చెట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ పడిపోయిన చెట్టును సైంటిఫిక్‌గా తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి (కొవ్వూరు)

వామ్మో.. రూ.పది కోట్లా?



దక్షిణాదిలో కొంత కాలం పాటు అగ్ర నటిగా కొనసాగిన సమంత.. స్టార్ హీరోలకి ఏ మాత్రం తగ్గని రేంజ్‌లో పారితోషికం అందుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే లేటెస్ట్‌గా అందిన సమాచారం మేరకు.. ఆమె తీసుకునే పారితోషికం రూ.పది కోట్లకు చేరిందట. అదీ సినిమాకు కాదండోయ్. 'హనీ బన్నీ' అనే స్పై థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు. 'సిటాడెల్' అనే ఆంగ్ల వెబ్ సిరీస్‌కు భారతీయ వెర్షన్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ కోసం రూ.పది కోట్ల రికార్డు పారితోషికం సమంత అందుకున్నారట. వరుణ్‌ధావన్‌తో కలసి నటించిన ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవ్వనుంది. ఇంతకు ముందు కూడా ఓ ప్రాజెక్ట్ కోసం ఒక బాలీవుడ్ ప్రొడ్యూసర్ భారీ మొత్తం సమంతకు ఆఫర్ చేయగా.. ఆమె తిరస్కరించారని టాక్. ఆ ప్రొడ్యూసర్ సమంతకు భారీ పారితోషికంతో పాటు లాభాల్లో 25 శాతం వాటా కూడా ఆఫర్ చేశారట. సమంత ఆ చిత్రాన్ని అంగీకరించి ఉంటే అది ప్రస్తుతం ఆమె ఈ సిరీస్ కోసం తీసుకున్న రూ.పది కోట్ల కంటే ఎక్కువే అయ్యేది.

డజనుకు పైగా చిత్రాలు.. ఒకే రోజు!



ఒకే రోజు మూడు నాలుగు సినిమాలు విడుదల కావడం సర్వసాధారణమే. సంక్రాంతికో.. దసరాకో.. ఇలా ఆరు లేదా ఏడు సినిమాలు ఒకే రోజు విడుదలైన సందర్భాలు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకూ భారీ బడ్జెట్ చిత్రాలే ఉంటాయి. మీడియం బడ్జెట్‌లో తయారైన చిత్రాలు కూడా ఒక రోజున ఐదారు విడుదలైన సందర్భాలు లేకపోలేదు. అయితే వచ్చే గురువారం (ఆగస్టు 15) నాడు ఒకటి కాదు రెండు కాదు .. దాదాపు డజనుకు పైగా దక్షిణాది చిత్రాలు వెండితెర పై సందడి చేయనున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు లాంగ్ వీకెండ్ కూడా కలసి వస్తుండడమే ఈ సందడికి కారణం. ఆ సినిమాల వివరాల్లోకి వెళితే...

మాస్ మసాలా సినిమాలకు పెట్టింది పేరు రవితేజ. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మిస్టర్ బచ్చన్'తో థియేటర్లలో జోష్ తీసుకురావడానికి దర్శకనిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇందులో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. సినిమాలో ఆయన ఇన్‌కమ్ టాక్స్ అధికారి పాత్రను పోషించారు. . యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. గతంలో రవితేజతో 'షాక్', 'మిరపకాయ్' వంటి చిత్రాలు తెరకెక్కించిన హరీశ్ శంకర్ దీనికి దర్శకుడు. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ సినిమాలో రవితేజ వింటేజ్ లుక్, నూతన నటి భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాకు ప్లస్ అవుతాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.





బంగారు గనుల నేపథ్యంలో...

'శివ పుత్రుడు', 'అపరిచితుడు' వంటి చిత్రాలతో తెలుగుతోనూ పాపులర్ అయిన నటుడు విక్రమ్. ఆయన లేటెస్ట్‌గా నటించిన పీరియాడికల్ డ్రామా చిత్రం 'తంగలాన్'. 'మద్రాస్', 'కాలా' చిత్రాల ఫేమ్ పా.రంజిత్ దీనికి దర్శకత్వం వహించారు. 19వ శతాబ్దంలో కర్ణాటకలోని కోలార్ బంగారు గనుల కార్మికుల జీవితాల నేపథ్యంలో జరిగే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో విక్రమ్‌తో పాటు పాత్రధారులందరూ విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా అయినా విక్రమ్ విజయాల కొరతను తీరుస్తుందని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్.. సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి.

డబుల్ ఎంటర్టైన్‌మెంట్



'ఇస్మార్ట్ శంకర్'తో 2019లో సూపర్ హిట్ కొట్టారు డైరెక్టర్ పూరి జగన్నాథ్, హీరో రామ్ పోతినేని. వారి కలయికలో ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న పూరీ జగన్నాథ్, రామ్ పోతినేనికి ఈ చిత్ర విజయం చాలా కీలకం కానుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచేసేలా చేశాయి. యాక్షన్ సన్నివేశాలకు థియేటర్స్‌లో పూనకాలు గ్యారంటీ అని చిత్ర బృందం ధీమాగా ఉంది. పూరి మార్క్ డైలాగ్స్‌ను తెలంగాణ యాసలో రామ్ పలికిన తీరు.. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటిస్తుండడం, మణిశర్మ సంగీతం సినిమాకు ప్రధానాకర్షణగా ఉండనున్నాయి.

'ఆయ్' అంటూ సందడి

గోదావరి యాస నేపథ్యంలో.. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఆ కోవలోకి చెందిన చిత్రమే 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' ట్యాగ్‌లైన్. ఫుల్ లెంగ్త్ వినోదం గ్యారంటీ అంటూ ప్రచార చిత్రాలతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాను అంజి కంచిపల్లి తెరకెక్కించారు. నార్నే నితిన్, నయన్ సారిక ఇందులో హీరో హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ వచ్చింది.

అదే రోజున ఈ చిత్రాలు కూడా...



నటనా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కీర్తి సురేశ్.. కయల్విజి అనే పాత్రలో, హిందీ రాని తమిళమ్మాయిగా.. నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'.. 'ఎవడే సుబ్రమణ్యం', 'కల్యాణ వైభోగమే' ఫేమ్ మాళవిక నాయర్ నటించిన 'క్రిష్ణమ్ ప్రణయ సఖీ' అనే కన్నడ సినిమా.. హిందీ చిత్రం 'అంధాధూన్' రీమేక్‌గా తమిళంలో తెరకెక్కిన 'అంధగాన్'.. 'డిమోంటీ కాలనీ' అంటూ తెలుగు వారిని భయపెట్టిన తమిళ హారర్ చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న 'డిమోంటీ కాలనీ 2'.. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించిన థ్రిల్లర్ 'భైరతి రణగల్'.. భావన నటించిన 'హంట్' అనే మలయాళ హారర్ థ్రిల్లర్.. 'దృశ్యం' సినిమా సిరీస్‌తో నేషనల్‌వైడ్ గుర్తింపు పొందిన జీతూ జోసెఫ్ తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'నున కూజి'.. 'వాజా' అనే మలయాళ కామెడీ చిత్రం కూడా అదే రోజు బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాలతో పోటీ పడుతున్నాయి. ఈ సినిమాల్లో ఏవి ప్రేక్షకుల ఆదరాభిమానాలు దక్కించుకుంటాయో ఈ నెల 15 వరకు వేచి చూడాల్సిందే.

పెద్ద విజయం కోసం... చిన్న కథ



వినోదాత్మక చిత్రాలతో ఓ వైపు అలరిస్తూనే.. ప్రయోగాత్మక చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలకు ఎప్పుడూ ముందుండే నటుడు ప్రియదర్శి. ఆయన చాణక్య వర్మ అనే పాత్రతో స్కూల్ టీచర్‌గా నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. సెలక్టివ్‌గా సినిమాలు చేసే నివేదా థామస్ ఇందులో ఓ మధ్య తరగతి ఇల్లాలి పాత్రను పోషించారు. విశ్వదేవ్, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించారు. నంద కిశోర్ ఈమని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో పాటు గుండెని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయని టీజర్ ద్వారా తెలుస్తోంది.

కొత్తగా..

సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'



యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటించే కొత్త చిత్రం 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 30 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు, పాటలు చిత్రీకరిస్తామని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ చెప్పారు. తొలి రోజు షూటింగ్‌లో రాశీ ఖన్నా కూడా పాల్గొన్నారు. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. వైవా హర్ష ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని, జ్ఞానశేఖర్ బాబా ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

ప్రేమికులు రిలేట్ అయ్యేలా...



విజయ్‌శంకర్, విషిక జంటగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదనీ, ప్రేమలో ఉన్న ప్రతి లవర్ రిలేట్ చేసుకొనేలా సినిమా ఉంటుందని విజయ్‌శంకర్ చెప్పారు. తను పోషించిన పాత్ర చూశాక అమ్మాయిలు తమ బాయ్‌ఫ్రెండ్స్‌ని ఇబ్బంది పెట్టరని హీరోయిన్ విషిక చెప్పారు.

యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్



సాగర్, శ్రుతి శంకర్ జంటగా నటించిన 'కాలం రాసిన కథలు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని ఈ నెల 29న విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. యం. యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

పోలీస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్



విభిన్న పాత్రలతో అలరిస్తున్న విశ్వక్ సేన్ ఇప్పుడు పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. 'దసరా' తో భారీ బ్లాక్ బస్టర్‌ను అందించిన సుధాకర్ చెరుకూరి ఈ చిత్ర నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఎవ్రీ యాక్షన్ హైర్స్ ఏ రియాక్షన్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇదనీ, విశ్వక్ సేన్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తారని దర్శక నిర్మాతలు చెప్పారు. విశ్వక్ సేన్‌కు ఇది 13వ సినిమా.

అలరించే కుర్రోళ్లు



అంతా కొత్త వారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్, సాయిదుర్గ తేజ్, అడవి శేష్, నాగబాబు, వెంకీ అట్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'పదిహేను మంది కొత్త ఆర్టిస్టులను పరిశ్రమకు అందిస్తున్నాను..అనే తృప్తి నాకు ఉంది. చిత్ర దర్శకుడు వంశీ పేరు ఇకపై ఎక్కువగా వినిపిస్తుంది' అని చెప్పారు. చిత్రం పెద్ద హిట్ కావాలని అతిథులు కోరారు.

కొత్త జిల్లాలు ఇక స్వతంత్రం..

- ఉద్యోగుల బదిలీలు, అభివృద్ధి పనుల శాంక్షన్లు చేసుకోవచ్చు
- ఇందుకోసం పూర్వపు జిల్లాపై ఆధారపడనవసరం లేదు
- అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినప్పటికీ రాష్ట్రపతి వాటికి గజిట్ నోటిఫికేషన్ జారీ చేయని కారణంగా నేటికీ కొన్ని విషయాల్లో పూర్వపు జిల్లాలే పెద్ద తలకాయలుగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల సందర్భంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల ట్రాన్స్‌ఫర్లు కూడా మునుపటి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కొత్త జిల్లాల కలెక్టర్లు కూర్చుని చేసుకోవాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది. అలానే ఇంజనీరింగ్ శాఖల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయి అధికారులు పాత జిల్లాలోనే ఉన్నారు. కొత్త జిల్లాల్లో కార్యనిర్వాహక ఇంజనీర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా రూ.40 లక్షల అంచనా విలువ దాటే పనుల సాంకేతిక అనుమతుల కోసం పూర్వపు జిల్లా ఎస్ఈని ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఎస్ఈ, ఈఈ, జేడీ, డీడీ, ఏడీ వంటి హోదాలను పక్కన పెట్టి జిల్లా అధికారులుగా మార్చారు. దీనివలన పరిపాలనపరంగా సమస్యలు తలెత్తుతుండటంతో సీఎం చంద్రబాబు పాత, కొత్త అన్న వ్యత్యాసం లేకుండా అన్ని జిల్లాలకు సమాన అధికారాలు కల్పించాలని సీఎస్‌ని తాజాగా ఆదేశించారు.

లోక్‌సభ నియోజకవర్గాన్ని ప్రాతిపదికగా చేసుకొని వైసీపీ ప్రభుత్వం 2022లో కొత్త జిల్లాలను ఏర్పాటుచేసింది. అయితే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించకుండా హడావిడిగా ఆయా జిల్లాల నుంచి పాలనను ప్రారంభించింది. అయితే నేటికీ రాష్ట్రపతి ఆమోదం లభించలేదు. దీంతో విభజన జరగకముందు ఉన్న జిల్లా సూపర్‌పవర్‌గా వ్యవహరిస్తున్నది. అలానే నేటికీ కొన్ని శాఖల విభజన జరగలేదు. ఇటీవల తహసీల్దార్లు వెనక్కు వచ్చినప్పుడు కూడా సీసీఎల్ఏ జారీచేసిన నిబంధనల మేరకు కొత్త జిల్లాల్లో వారిని సర్దుబాటు చేయలేకపోతే గుంటూరు జిల్లా కలెక్టర్ వద్ద కూర్చుని బదిలీలు చేయాలని పల్నాడు, బాపట్ల కలెక్టర్లను రెవెన్యూ శాఖ ఆదేశించింది. ఇది ఒకింత ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇబ్బందికరంగా మారుతున్నది. గనుల శాఖలో ఒకప్పుడు డీడీ, డివిజన్ స్థాయిలో ఏడీలు ఉండేవారు. ఇప్పుడు జిల్లా మైనింగ్ అధికారిగా హోదా మార్చారు. ఏడీ స్థాయి అధికారులను పోస్టింగ్ చేశారు. దీంతో డీడీ స్థాయి అధికారులంతా మైనింగ్ రాష్ట్ర కార్యాలయానికి పరిమితం కావాల్సి వచ్చింది.

ఇలా పరిపాలన కొత్త జిల్లాల్లో కుదురుకోలేదు. దీనిపై కొన్ని జిల్లాల నుంచి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులు రావడంతో జిల్లా అన్నప్పుడు అది స్వతంత్రంగానే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా కొత్త జిల్లాలు స్వతంత్రంగా ముందుకు సాగేలా చూడాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇకపై పల్నాడు, బాపట్ల జిల్లాలు పరిపాలన, సాంకేతిక అనుమతులు, బదిలీల కోసం పూర్వపు జిల్లా అయిన గుంటూరుపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

జోరువానలోనూ అర్జీదారుల వెల్లువ

- వినతులు స్వీకరించి భరోసా ఇచ్చిన లోకేశ్
- 21వ రోజు ప్రజాదర్బార్‌కు భారీగా ప్రజల రాక



జోరువానలోనూ గొడుగులు వేసుకుని ప్రజాదర్బార్‌కు వస్తున్న అర్జీదారులు

తాడేపల్లి, ఆగస్టు 6: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్కరిని కదిలించినా కష్టాలు.. కన్నీళ్లు.. ఎదురవుతున్నాయి. విధ్వంసపాలనలో తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించక ప్రజలు ఎంతో ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రజాదర్బార్ ద్వారా తొలినుండి యువనేత నారా లోకేశ్ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. 21వ రోజు మంగళవారం జోరువానను సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీదారులు ఉండవల్లి కరకట్ట వద్దకు విచ్చేసి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించి పరిష్కరించాలంటూ కోరారు. లోకేశ్ పరిష్కరిస్తానని భరోసా ఇవ్వడంతో సంతోషంతో అర్జీదారులు వెనుదిరిగారు. ముఖ్యంగా తమ భూములు కబ్జాకు గురయ్యాయని, ఏ ఆధారం లేని తమకు శాశ్వత నివాసం కల్పించాలని, గత ప్రభుత్వంలో అర్హత ఉన్నా వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ తొలగించారని, అనారోగ్యంతో బాధపడుతున్న తమకు వైద్యసాయం అందించాలని, వివిధ వృత్తి, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి లోకేశ్‌ను కలిసి పలువురు వినతులు అందించారు.

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం వీ తిమ్మాపురానికి చెందిన లక్ష్మన్న లోకేశ్‌ను కలిసి తమ కూతురు గ్రామంలోనే నాలుగవ తరగతి పూర్తి చేసిందని పై చదువుల కోసం ఆర్థిక పరిస్థితి సహకరించనందున గురుకుల పాఠశాలలో 5వ తరగతికి సీటు కల్పించాలని కోరారు. ప్రకాశం జిల్లా ఎనికేపాడుకు చెందిన జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబసభ్యులతో శ్రీశైలం తీర్థయాత్రలకు వెళ్లగా తమ ఇంటిలో బంగారం, నగదు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని వాపోయారు. తమ సమస్య పరిష్కారం అయ్యేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. వైసీపీ హయాంలో మాజీ హోంగార్డులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలంటూ ఏపీఈహెచ్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేశ్‌ను కోరారు. గంజాయి మత్తులో తమ పదహారేళ్ల కుమారుడిని హత్య చేశారని, నిందితులను శిక్షించడంతోపాటు ఏ ఆధారం లేని తమకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రామగోపాలపురానికి చెందిన అజ్మీర లక్ష్మణ్ కోరారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కొత్తపల్లిలో తమ అర ఎకరం పొలాన్ని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు కబ్జా చేశారని, వారిమీద చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వాసిరెడ్డి సూర్యప్రసాద్ లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరులోని శ్రీనివాసకాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు లోకేశ్‌ను కలిసి 25 ఏళ్ల క్రితం ఉడా ఆమోదం పొందిన లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని తమ లేఅవుట్‌లో రోడ్లు, డ్రెయినేజీ తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తన తండ్రికి పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన ఎస్ నవ్యభారతి విజ్ఞప్తి చేశారు. తనకు వితంతు పింఛన్ అందించాలని దుగ్గిరాల మండలం చుక్కపల్లివారిపాలెంకు చెందిన మండ్రు కుమారి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ, పీజీటీ పార్ట్ టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీని కాంట్రాక్టు టీచర్లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులమైన తమను ఆదుకోవాలంటూ బాధలు చెప్పుకుని లోకేశ్‌కు పలువురు దివ్యాంగులు వినతిపత్రం అందించగా వారివద్దకు వచ్చి సమస్య పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. 2016-18 మధ్య పీజీ పూర్తిచేసిన తనకు ఫీజు



ఓ కుటుంబం నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న నారా లోకేశ్

రీయింబర్సుమెంట్ అందక సర్టిఫికెట్లు కాలేజీలోనే నిలిచిపోయాయని సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ వాంబేకాలనీకి చెందిన కె. మాధవి, లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రాని ఆదుకోవాలి

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది.. దీనిపై శ్వేతపత్రం కూడా విడుదల చేశాం..
- గత ఐదేళ్లలో వృద్ధి రేటు గణనీయంగా తగ్గిపోయింది..
- అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం కేంద్రం ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది..
- లోక్‌సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, ఆగస్టు 6: ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం సాయం చేసి ఆదుకోవాలని, అభివృద్ధిని మెరుగుపరిచేందుకు సహకరించాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిందని ఈ పత్రాలను అందజేస్తామని చెప్పారు. లోక్‌సభలో మంగళవారం ఆర్థిక బిల్లుపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఏపీ ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతోందని.. కేంద్రమే గట్టెక్కించి ఆదుకోవాలని, ప్రస్తుతం మా ప్రభుత్వం కేంద్రంతో పనిచేయటానికి ఉందని అదనపు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ఖర్చులు రూ.1.64లక్షల కోట్లు కాగా రెవెన్యూ రూ.1.45లక్షల కోట్లుగా ఉందని, ఈ ఏడాదిలో రూ.19వేల కోట్ల లోటు స్పష్టంగా ఉందని తెలిపారు. రాష్ట్ర అప్పు 2019లో రూ.3.75లక్షల కోట్లు కాగా అది 2024కి రూ.9.74లక్షల కోట్లకు పెరిగిందన్నారు. గత ఐదేళ్లలో వృద్ధిరేటు గణనీయంగా తగ్గిపోయిందని, ఏపీలో వృద్ధిరేటు 13.5 నుంచి 10.5శాతానికి పడిపోయిందని వెల్లడించారు. వ్యవసాయ వృద్ధిరేటు 16నుంచి 10శాతానికి తగ్గిపోయిందన్నారు. ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగా ల్లో వెనకబడింది. రాష్ట్ర ద్రవ్యోల్బణం 4.5శాతం నుంచి 6శాతాన్ని మించిందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కేంద్రం ఏపీపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. రెవెన్యూ లోటు, అప్పుల భారం నుంచి బయటపడేందుకు చేయూతనివ్వాలని విజ్ఞప్తిచేశారు.ప్రధాన ఆధారితమైన రైతులు, చేనేత కార్మికులను మరింతగా ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఆక్వా ఎగుమతులు 70శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయని, ఈ పరిస్థితిలో పీఎం మత్స్యసంపద యోజన కింద ఆక్వారైతులను ప్రోత్సహించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక నిధులు ఏమీ ఇవ్వడం లేదని, పూర్వోదయ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.62వేల కోట్లు కేటాయించారని, కోస్తా ప్రాంతంలో పెద్ద రాష్ట్రం గనుక ఏపీకి ఎక్కువ నిధులు వస్తాయని స్పష్టంచేశారు. దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను విషయంలో పునరాలోచన చేయాలని, ఆరోగ్య, బీమా పాలసీలపై 18శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలని కోరారు. టెక్స్‌టైల్ రంగాన్ని ఆదుకొనేందుకు పత్తి దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కోరారు. ఆర్థికరంగం నుంచి గతంలో చెల్లించాల్సిన పన్నుల విధానాన్ని ఎత్తివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి రాజధానిలో జంగిల్ క్లియరెన్స్

- సెక్రటేరియేట్ వెనక ఎన్ 9 రోడ్డులో పనులు ప్రారంభించనున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 6: రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. ఐదేళ్లలో వైసీపీ సర్కార్ రాజధాని అమరావతిలో ముళ్ల చెట్లు, తుమ్మ చెట్లను పెంచి చిట్టడవిని చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే ముందు రోడ్ల వెంట కంపచెట్లను తొలగించారు. పూర్తిస్థాయిలో (26వేల ఎకరా లు) జంగిల్ క్లియరెన్సు పనులు చేయటానికి గత నెలలోనే టెండ ర్లు పిలిచారు. బుధవారం నుండి ఆ పనులు ప్రారంభించటానికి టెండర్ దక్కించుకున్న ఎన్‌సీసీ కంపెనీ యంత్రాలను రంగలోకి దించింది. వెలగపూడి సెక్రటేరియేట్ వెనక వైపు ఉన్న ఎన్-9 రోడ్డు లో జంగిల్ క్లియరెన్స్ పనులను బుధవారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఉదయం 8గంటలకు ప్రారంభించనున్నారు. కాగా వ్యవసాయం లేకపోవటంతో ఉపాధిపనులు లేక కూలీలు, ట్రాక్టర్, లారీలు, పొక్లెయినర్ యంత్రాలున్నవారు ఖాళీగా ఉంటున్నారు. జంగిల్ క్లియరెన్సు పనులలో స్థానికులకు ముందు అవకాశం కల్పించాలని రాజధాని రైతులు కోరుతున్నారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి సిటీ, ఆగస్టు 6: పదవ జాతీయ చేనేత దినోత్సవం బుధవారం చేనేత కేంద్రమైన మంగళగిరిలో జరుగనుంది. స్వాతంత్ర్యానికి పూర్వం విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చిన ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం 2015లో నిర్ణయించింది. చేనేత విశిష్టత, నేత కార్మికుల సంక్షేమం, ఉపాధి, మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించడం వంటి అంశాలతో ప్రతి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. గుంటూరు జిల్లాకు సంబంధించి మంగళగిరి కేంద్రంగా జాతీయ చేనేత దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. బుధవారం ఉదయం ఏడున్నర గంటలకు ఎన్నారై వైజంక్షన్‌లోని నేతన్న సర్కిల్‌లో నేతన్న విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి గౌతమబుద్ధ రోడ్డు, దేవస్థానం మీదుగా చేనేత వాక్ నిర్వహించి నాంచారమ్మ చెరువు సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తారు. అనంతరం తెనాలి రోడ్డులోని మార్కండేయ కల్యాణ మండపంలో చేనేత దినోత్సవ సభ జరుగుతుంది. వృత్తి నైపుణ్యం కలిగిన పలువురు చేనేత కార్మికులను సన్మానిస్తారు. ఈ వేడుకలకు సంబంధించి కలెక్టరు పర్యవేక్షణలో చేనేత జౌళి శాఖ, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తిచేశారు.



చేనేత దినోత్సవానికి ముస్తాబైన నేతన్న సర్కిల్

మంత్రి సత్యకుమార్ రాక

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం మంగళగిరిలో పర్యటిస్తారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కాండ్రు భానుకిషోర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎన్నారై జంక్షన్‌లో నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి, భద్రావతినగర్‌లోని లక్ష్మీశారీస్‌లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు.

అంగన్వాడీ పాలప్యాకెట్లు, కోడిగుడ్లపై విచారణ

- జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి శ్రీవాణి

గుంటూరు సిటీ, ఆగస్టు 6: గుంటూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పాలప్యాకెట్లు, కోడిగుడ్ల వినియోగంపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి శ్రీవాణి వెల్లడించారు. అమ్మామ్మాల అంగన్వాడీ అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని సి.డి.పి.ఓ.లు అందరికీ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో ఉన్న సూపర్‌వైజర్లను తక్షణమే వారు పనిచేసే సెక్టార్ కాకుండా మరొక సెక్టార్లకు మార్చవలసిందిగా ఆదేశించినట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల యూనిఫాం వంకతో వసూలుచేస్తున్న విషయంపై కూడా విచారణ చేపట్టి, వాస్తవాలు రుజువైన వెంటనే వారిపై కఠినచర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. గత సంవత్సరం నుండి మెడికల్ లీవ్‌లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల వేతనాల వివరాలు, వారి మెడికల్ సర్టిఫికెట్లు, అన్నీ తెప్పించుకొని పరిశీలిస్తామని తెలిపారు.

యోగ ఇన్‌స్ట్రక్షన్ పుస్తకావిష్కరణ

పెదకాకాని, ఆగస్టు 6: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రాల కళాశాలలోని యోగ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ కాశీభట్ల సత్యమూర్తి రచించిన యోగ ఇన్‌స్ట్రక్షన్ అనే పుస్తకాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత సత్యమూర్తిని అభినందించారు. యోగా కేవలం శారీరక వ్యాయామంలాగా కాకుండా దేహము, మనస్సు సమన్వయాన్ని సాధించేలా విద్యార్థులు సాధన చేయాలన్నారు. ఈ పుస్తకం అధ్యాపకులకు ఒక టీచింగ్ మాన్యువల్‌గా ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సిం హాచలం, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, వ్యాయామ కళాశాల యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ అధ్యాపకులు ఏ రాధిక, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

యూజీ పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేసిన కోఆర్డినేటర్

పెదకాకాని, ఆగస్టు 6: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 5, 6 సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలో ఆగస్టు 1 నుంచి జరుగుతున్నాయి. పరీక్షల నిర్వహణ తీరుపై యూజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు గుంటూరులోని హిందూ కళాశాల, బండ్లమూడి హనుమాయమ్మ మహిళా కళాశాలలోని పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏఎన్‌యూ విద్యార్థుల ఎంపిక

పెదకాకాని, ఆగస్టు 6: న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈనెల 15న జరిగే భారత స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రోగ్రాం ఇన్‌ఛార్జి కోఆర్డినేటర్ డాక్టర్ వి.దివ్య తేజోమూర్తి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొంటుండగా ఏఎన్‌యూ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వర్సిటీ పరిధిలోని నిర్మల ఫార్మసీ అనుబంధ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం నుండి బుర్ర దివ్యశ్రీ(బీఫార్మసీ), ఎస్.రేవంత్ సాయి(ఫార్మాడీ) ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఇరువురు విద్యార్థులను అభినందించి సత్కరించా రు.

యూజీసీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ అశోక్‌కుమార్ నియామకం

పెదకాకాని, ఆగస్టు 6: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో యూజీసీ విభాగం కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వై.అశోక్‌కుమార్ (అంబేద్కర్ చైర్) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, ఇన్‌ఛార్జి రెక్టార్ ప్రొఫెసర్ రత్న షీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

స్కూటర్‌లో ఉన్న రూ.6లక్షల నగదు మాయం

ప్రత్తిపాడు, ఆగస్టు 6: బ్యాంకు నుండి డ్రా చేసి స్కూటర్‌లో పెట్టిన నగదు మాయమైన సంఘటన ప్రత్తిపాడులో మంగళవారం జరిగింది. పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గణేశన మురళీకృష్ణ మంగళవారం స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకు నుండి ఆరు లక్షల నగదును డ్రా చేశాడు. ఆ సొమ్మును తన స్కూటీలో పెట్టుకుని తన గ్రామానికి బయలు దేరి కూరగాయలు కొనేందుకు మార్కెట్‌లోకి వెళ్లి వచ్చేసరికి స్కూటీ సీటు లేపి ఉండడం, అందులోని నగదు కనిపించకుండా పోయింది. దీంతో వెంటనే ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించాడు.

డిసెంబరు 4 నుంచి శబరి ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ సస్పెన్షన్

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - త్రివేండ్రం సెంట్రల్ - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్‌కు అన్ని తరగతుల రిజర్వేషన్‌ని డిసెంబరు 4వ తేదీ నుంచి రైల్వే శాఖ సస్పెన్షన్ చేసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు డిసెంబరు 4వ తేదీ(120 రోజులు ముందుగా) రిజర్వేషన్ ఓపెన్ కావాల్సి ఉన్నది. చాలామంది ఆ తేదీన శబరిమలకు వెళ్లేందుకు నిర్ణయించుకొని మంగళవారం ప్యాసింజర్ రిజర్వేషన్ టిక్కెట్ కౌంటర్లకు వెళ్లారు. ఎంతసేపటికీ బుకింగ్ ఓపెన్ కాలేదు. ఐఆర్‌సీటీసీ యాప్/వెబ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. సిబ్బంది నుంచి తగిన సమాచారం రాకపోవడంతో టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడానికి వచ్చిన వారు అసంతృప్తికి గురయ్యారు. శబరి ఎక్స్‌ప్రెస్ డిసెంబరు నాల్గో తేదీ నుంచి ఎల్‌హెచ్‌బీ రేక్‌గా మారబోతున్నట్లు సమాచారం. దీని వలన కోచ్ కంపోజిషన్‌లో మార్పులు జరుగుతాయి. ఈ కారణంగానే రెండు వైపులా రిజర్వేషన్‌ని తాత్కాలికంగా సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. కొద్ది రోజుల్లోనే బుకింగ్ ప్రారంభమౌతుందని రైల్వేవర్గాలు తెలిపాయి. ఎల్‌హెచ్‌బీ రేక్ వలన స్లీపర్‌క్లాస్ భోగీల సంఖ్య తగ్గి ఏసీ త్రీ, టూటైర్ కోచ్‌లు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.

మద్యం మత్తులో బాలుడిపై దాడి



బాలుడిపై దాడి చేస్తున్న యువకులు

చుండూరు, ఆగస్టు 6: మద్యం మత్తులో ఏడుగురు యువకులు మైనర్ బాలుడిని పాశవికంగా చిత్రహింసలకు గురిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చుండూరు పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. చినపరిమికి చెందిన 17 సంవత్సరాల బాలుడు షేక్ అజ్గర్‌ని అతని స్నేహితులు గ్రామ శివారులోని నిర్మానుష్యంగా ఉండే చెరువు గట్టు వద్దకు తీసుకువెళ్లారు. అందరూ మద్యం సేవిస్తున్న సమయంలో ఓ బాలిక విషయంలో వారి మధ్య వివాదం చెలరేగింది. దీంతో అక్కడ ఉన్న ఏడుగురు యువకులు అజ్గర్‌పై ఒక్కసారిగా బెల్టులు, కర్రలు, కాళ్ళతో తంతూ చిత్రహింసలకు గురి చేశారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న చుండూరు పోలీసులు మంగళవారం వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధితుడు అజ్గర్‌ను చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

కుటుంబ కలహాల నేపథ్యంలో..
భార్యను హతమార్చి.. భర్త ఆత్మహత్య



వాకా బాబూరావు భార్య మహాలక్ష్మీ (ఫైల్‌ఫొటో)

రేపల్లె, ఆగస్టు 6: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరగటంతో ఆవేశానికి గురైన భర్త సోమవారం రాత్రి కర్రతో బలంగా కొట్టటంతో తీవ్రగాయాలైన భార్య అక్కడికక్కడే మృతిచెందింది. భయాందోళన చెందిన భర్త పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం బాపట్ల జిల్లా రేపల్లె మండలం చాట్రగడ్డ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రేపల్లె మండలం చాట్రగడ్డ గ్రామానికి చెందిన వాకా బాబూరావు(55), భార్య మహలక్ష్మీ(50) మధ్య గత రెండు సంవత్సరాలుగా మనస్పర్థలతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగటంతో కోపోద్రిక్తుడైన బాబూరావు, భార్య మహాలక్ష్మీని కర్రతో బలంగా కొట్టటంతో తీవ్రగాయాలై రక్తస్రవం కాగా అక్కడికక్కడే మహాలక్ష్మీ చనిపోయింది. భార్య మృతితో తీవ్ర మనస్తాపానికి గురై భయాందోళన చెందిన భర్త బాబూరావు పురుగుమందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పట్టణ సీఐ నజీర్‌బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. భార్యాభర్తల మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

38,800 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 40,747 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 38,800 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 20,998 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	17000	334	8500	15500
నెంబరు. 5	10000	13500	నెంబరు.5	12500	12500
273	--	--	273	13000	13000
341	10000	17000	341	14500	15000
4884	--	--	4884	17000	17500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	8500	18500
బ్యాడిగి	8500	16000	బ్యాడిగి	10000	13700
దేవనూరుడీలక్స్	9000	12500	దేవనూరుడీలక్స్	9000	13000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5500	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఉధృతంగా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

● నదీతీర ప్రాంతవాసులను అప్రమత్తం చేసిన అధికారులు



రామాపురం కృష్ణానది రేవు వద్ద లంగర్ వేసి నిలిపిన చేపల పడవలు

దాచేపల్లి, ఆగస్టు 6: నాగార్జునసాగర్ నిండుకుండలా మారడంతో డ్యామ్ నుంచి వస్తున్న వరదనీటితో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని నదీతీరప్రాంత గ్రామాలైన పొందుగల, రామాపురం, భట్రుపాలెం, తంగెడ, ఏలియంపేట రేవుల వద్ద చేపలుపట్టె బెస్తకారులను నదిలో చేపలు పట్టేందుకు వెళ్లవద్దని అధికారులు అప్రమత్తం చేశారు. ముఖ్యంగా రామాపురం గ్రామంలో నది ఒడ్డున నివాసముంటున్న పల్లెకారులు రాత్రివేళ మరింత అప్ర మత్తంగా ఉండాలని నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు. వరద నీరు ఉధృతి పెరగడంతో సాగర్ నుంచి నీటిని మరింత అదనంగా విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో రామాపురంలోని పల్లెకారులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని అధికారులు సహాయక చర్యలను చేపడుతున్నారు. దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావు, ఎంపీడీవో వెంకటరమణ, దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఇతర పంచాయతీశాఖ అధికారులు నదీతీర ప్రాంత వాసులకు కావలసిన జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నారు. వృద్ధులను, చిన్నారులను, మహిళలను రాత్రివేళ సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు.

తక్షణమే ఇల్లు ఖాళీ చేయాలి : ఎస్ఐ

బెల్లంకొండ, ఆగస్టు 6 : ముంపు గ్రామాల్లో నివాసం ఉంటున్న వారు గ్రామాలను ఖాళీ చేసి వెంటనే బయటకు రావాలని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ గేట్ల ద్వారా నీటిని వదలటంతో కృష్ణానది పరివాహక గ్రామాల్లో ఉన్న ముంపు బాధితులు తక్షణమే ఇళ్లను ఖాళీ చేసి బయటకు రావాలన్నారు. కొంత మంది బాధితులు ముంపు గ్రామాల్లోనే నివాసం ఉంటున్నారని, వారు వెంటనే ప్రభుత్వం కేటాయించిన గ్రామాలకు వెళ్లాలని సూచించారు. లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

'సేవ్ గర్ల్' కార్యక్రమంపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అస్రిపున్నీసాబేగం

బెల్లంకొండ, ఆగస్టు 6: బెల్లంకొండ జడ్పీ పాఠశాలలో మంగళవారం సాయంత్రం పల్నాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ్ గర్ల్ కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ అస్రిపున్నీసా బేగం హాజరయ్యారు. ఆడపిల్లలు సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. బాగా కష్టపడితే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ మహిళలపై ఎన్నో దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో కోటమ్మ, జనసేన పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ మునగా వెంకటేష్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్, మాజీ సర్పంచ్ పీఎస్కే మస్తాన్ షరీఫ్, వీఆర్వో వెంకయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

బెల్లంకొండ జిల్లా పరిషత్ ఆవరణలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని బెల్లంకొండ నూతన తహసీల్దార్ అస్రిపున్నీసాబేగం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కూడా భోజనం రుచి చూశారు. ప్రతి రోజు విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని కోరారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ సుభానీ, మజీద్, తెలుగుయువత అధ్యక్షుడు సలాం, ఎంఈవో బాల సుందరరావు పాల్గొన్నారు.

241 బాటిళ్ల తెలంగాణ మద్యం స్వాధీనం

రెంటచింతల, ఆగస్టు 6: మండలంలోని మిట్టగుడిపాడు నుంచి సమాధానంపేట వెళ్లే రహదారిలో 241 బాటిళ్ల తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు చెప్పారు. వీటి విలువ రూ.38,760 ఉంటుందన్నారు. ఇద్దరు వ్యక్తులు కృష్ణానదిని పడవలో దాటి తీసుకువస్తుండగా పట్టుకున్నామన్నారు. ఒకరు పారిపోగా మరొకరు చంద్రశేఖర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సినారె సాహిత్య పురస్కారానికి మోహన్‌రావు ఎంపిక



మోహన్‌రావు

పిడుగురాళ్ల, ఆగస్టు 6: కవి సి.నారాయణరెడ్డి సాహిత్య పురస్కారాలు 2024 సంవత్సరానికి సాహిత్య పురస్కారా నికి పిడుగురాళ్లకు చెందిన వైహెచ్‌కే మోహన్‌రావు ఎంపికైనట్లు కళాపీఠం నిర్వాహకులు మల్లెకేడి రాములు, పోరెడ్డి రంగయ్యలు మోహన్‌రావుకు సమాచారం అందజేశారు. ఈ నెల 10వ తేదీన రంగారెడ్డి జిల్లా తుర్కయా జిల్‌లోని కళాపీఠంలో నిర్వహించే కార్యక్రమంలో మోహన్‌రావుకు పురస్కారం అందజేయనున్నారు. సాంస్కృతిక, సాహిత్య రంగాలకు చెందిన పలువురు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

రాజుపాలెం, ఆగస్టు 6: గుంటూరు-సికింద్రాబాద్ రైల్వే ట్రాక్ పక్కన మండలపరిధిలోని అనుపాలెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహంపడి ఉంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అనుపాలెం (ఓహెచ్ఈ- 68 బై17-18)సమీపంలో గుర్తు తెలియని సుమారు 30 సంవత్సరాల వయస్సు కల్గిన యువకుడి మృతదేహన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, పెయింట్ నెమలి కలర్ జీన్ ప్యాంట్ వేసుకొని ఉన్నాడని చెప్పారు. బంధువులు, తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌ను కలిసిన కూటమి నేతలు

దుర్గి, ఆగస్టు 6: నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఫణీంద్రకుమార్‌ను మంగళవారం కూటమి నేతలు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఫణీంద్రకుమార్‌కు కూటమి అభినేతలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, బృంగా లింగయ్య, జక్కా రమేష్, ఉన్నం మహేష్, మిర్యాల సుబ్బారావు, అరిగెల శివయ్య, కందుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే చెప్పండి

ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు

సత్తెనపల్లి, ఆగస్టు 6: సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేరు చెప్పి ఎవరైనా నియోజకవర్గస్థాయిలో డబ్బులు వసూలు చేస్తే ఎమ్మెల్యే కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో కోరాయి. నియోజకవర్గంలో కొందరు ఉద్దేశ పూర్వకంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేరును దుర్వినియోగం చేస్తూ అక్రమ వసూళ్లకు ప్రయత్నాలు చేస్తున్నారని కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. ఎటువంటి సమాచారాన్నైనా 9408639999 నెంబరుకు తెలిపాలని తెలిపాయి.

ఎస్ఎంసీ ఏర్పాటైన పాఠశాలలకే గ్రాంటు : డీవైఈవో

రెంటచింతల, ఆగస్టు 6: ప్రైవేట్ పాఠశాలలు మినహా మిగతా ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ పాఠశాలలన్నింటికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ఖచితంగా జరిపి తీరాల్సిందేనని సత్తెనపల్లి డిప్యూటీ ఈవో ఏసుబాబు ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏ కారణం చేతనైనా ఎన్నికలు నిర్వహించకపోతే గ్రాంట్లు విడుదల నిలిపి వేస్తారన్నారు. ఈ నెల 8న సభ్యుల ఎన్నికను ఆయా స్కూళ్ల హెచ్ఎంలు నిర్వహిస్తారన్నారు.

గ్రామాభివృద్ధితోపాటు ప్రజాసమస్యలు పరిష్కరించాలి

● నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, ఆగస్టు 6: గ్రామాభివృద్ధితో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పెదకూరపాడు, అమరావతి మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలపరిధిలోని ఎనికపాడు గ్రామంలోని ఆయన కార్యాలయంలో రెండుమండలాల పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులతో ప్రజా అవసరాలను తీర్చాలన్నారు. గ్రామాభివృద్ధిలో దాతలను భాగస్వాములను చేయాలని అన్నారు. ప్రతి కార్యదర్శి తమ గ్రామపరిధిలో ఐదు సంవత్సరాల్లో జరిగిన నిధులు, వ్యయానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు కాంట్రాక్టర్‌లకు చెల్లించాల్సిన బిల్లుల సమాచారం కూడా తన దృష్టికి తీసుకురావాలని ప్రవీణ్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో స్థానిక ఉమ్మడి కూటమి నాయకుల సలహాలు, సూచనలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి ప్రజలకు అందే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల ఎంపీడీవోలు రాణీ, మల్లేశ్వరీ, రెండు మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అధికారులతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు, అర్తిమళ్ల రమేష్ పాల్గొన్నారు.

సచివాలయాలను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రవీణ్


అమరావతి, నరుకుళ్లపాడు, ధరణికోట గ్రామాల్లోని సచివాలయాలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆకస్మికంగా పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి

అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, ఆగస్టు 6: ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలతో అచ్చంపేటలోని జిల్లా పరిషత్ గెస్ట్‌హౌస్‌లో ఉద్యోగులకు సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలతో గౌరవంగా మెలగాలని, పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకోవద్దన్నారు. ప్రజల నుంచి ఏమైనా ఉద్యోగస్తుల పై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించబోనని హెచ్చరించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని వీధి కుక్కల నివారణకు కూడా తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామ పంచాయతీ సచివాలయాలను సందర్శించనున్నట్లు తెలిపారు. డొంక రోడ్లు అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ ఎంపీడీవోలతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు 3లక్షల 64 వేల క్యూసెక్కుల నీరు విడుదల

● నిలిపివేసిన విద్యుదుత్పత్తి..



పులిచింతల ప్రాజెక్టు వద్ద 13 క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

రెంటచింతల, అచ్చంపేట, ఆగస్టు 6 : సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు మంగళవారం 3లక్షల 64 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కోలేగుండ్ల వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజులు చెప్పారు. 13 గేట్లను 5 మీటర్ల ఎత్తి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 2 లక్షల క్యూసెక్కుల పైగా నీరు రావడంతో ముందుజాగ్రత్త చర్యగా విద్యుదుత్పత్తిని నిలిపి వేశామన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.8 ఎంయూల(మిలియన్ యూనిట్) కరెంట్‌ను తయారు చేశామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.21 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.22 టీఎంసీలకు సమానంగా ఉందన్నారు. పూర్తి స్థాయి నీటి మట్టం 7.080 టీఎంసీలు

పర్యాటకులకు అనుమతివ్వాలి : ఎమ్మెల్యే జూలకంటి

టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి తెల్లటి నురగలతో జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులపై ఎలాంటి ఆంక్షలు విధించవద్దని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎస్ఈ కె.వెంకటరమణను కోరారు.మంగళవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ పర్యాటకులను అనుమతిస్తే కనువిందు చేసే నీటి సోయగాలను తనివి తీరా కళ్లారా చూసే భాగ్యం కలుగుతుందన్నారు. అలాగే విద్యుత్ పవర్ ప్లాంట్ సందర్శనకు అనుమతిస్తే కరెంట్ ఏ విధంగా తయారౌతుందనే విషయం పాఠశాల విద్యార్థులకు అర్థమవుతుందన్నారు.

నేడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సందర్శన

అచ్చంపేట, ఆగస్టు 6: పులిచింతల ప్రాజెక్టులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం సందర్శించనున్నారు. ఉదయం 9గంటలకు ప్రాజెక్టు వద్దకు చేరుకొని అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ప్రాజెక్టు వద్ద జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అందుకూరులో ఎమ్మార్పీఎస్ విజయోత్సవం

క్రోసూరు, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు రావటంపై మండలంలోని అందుకూరులో మంగళవారం రాత్రి విజయోత్సవం నిర్వహించారు. ఎస్సీ కాలనీతో పాటు పలువురు గ్రామస్తులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. పలువురు గ్రామస్థులను, ఎమ్మార్పీఎస్ నాయకులను శాలువాలతో సత్కరించారు. ఎస్సీ వర్గీకరణను మొట్టమొదటి సారిగా రెండు దశాబ్దాల క్రితమే అమలు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని అందుకూరు మాజీ సర్పంచ్ తాళ్ళూరి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దుగ్గి రవి, కొడవటి కృపారావు, రుద్రపోగు సురేష్, కంచర్ల జాన్‌బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

మాచర్లటౌన్, ఆగస్టు 6: పట్టణంలోని సూర్యకిరణ్ దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం మండల న్యాయ సేవాకమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ జూనియర్ న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్ ప్రత్యేక అవసరాల విద్యార్థులకు దివ్యాంగుల హక్కులు, వైద్య సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అనిల్‌కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, పుస్తకాల అందజేత

సత్తెనపల్లి, ఆగస్టు 6: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమ వేద ప్రకాష్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నాలుగు వందల మంది ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంను అందించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాంను అందించారు. కార్యక్రమంలో చింతాడ లలితాంబ మాతాజీ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మిర్చి నర్సరీల విస్తీర్ణం

● ఉద్యాన శాఖాధికారి మోహన్

రెంటచింతల, ఆగస్టు 6: ఈ ఏడాది పలు మండలాల్లో మిర్చి షేడ్ నెట్‌ల నర్సరీల విస్తీర్ణం 50 ఎకరాల దాకా పెరిగిందని గురజాల ఉద్యానాధికారి ఎనిబెరా మోహన్ చెప్పారు. మంగళవారం రెంటచింతలలోని పలు మిర్చి నర్సరీలను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. లైసెన్స్ లేకుండా నారు విక్రయించొద్దని, రిజిస్టర్ చేయించుకోవాలని ఆదేశించారు. నర్సరీలు పరిశుభ్రంగా ఉంటే చీడపీడలు ఆశించవన్నారు. నారు విక్రయించేటప్పుడు విధిగా రసీదులు ఇవ్వాలన్నారు. నర్సరీల ఏర్పాటుకు ఒక్కో ఎకరానికి రూ.18 లక్షలు ఖర్చవుతుందని అందులో రూ.8 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ రూపేణా ఇస్తుందన్నారు. దాచేపల్లి, రెంటచింతల, గురజాల, కారంపూడి తదితర మండలాల్లో కిందటేడాది వరకు 200 ఎకరాల్లో మిర్చి నారు సాగు చేసేవారని ఇప్పుడు 250 ఎకరాలకు చేరిందన్నారు.

గౌరీదేవిగా భద్రకాళి అమ్మవారు



నకరికల్లు, ఆగస్టు 6 : మండలంలోని కుంకలగుంటలో ఉన్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మంగళవారం పురస్కరించుకని గౌరీదేవిగా భద్రకాళి అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక స్వామి, ముప్పాళ్ళ విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు.

అల్లర్లకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం : సీఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం రాంబాబు

నకరికల్లు, ఆగస్టు 6: అల్లర్లకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం రాంబాబు హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం రాత్రి నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం దాడి సంఘటనలు, బైక్ దహనం సంఘటన వంటి ఘటనలు జరుగడంతో కుంకలగుంటపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గుండ్లపల్లి, చీమలమర్రిలలో ఈవీఎంలను పగల గొట్టారన్నారు. రూపెనగుంట్లలో యాసిడ్ దాడి బాంబు ఘటనలు జరిగాయన్నారు. పాపిశెట్టిపాలెం గ్రామంలో దాడుల్లో పలువురు గాయపడ్డారన్నారు. ఎన్నికల సమయంలో, కౌంటింగ్ సమయంలో, ఆ తరువాత జరిగిన హింసాత్మక ఘటనలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ళ ఎస్ఐలు కే నాగేందరరావు, సమీర్ బాషా, హజరత్తయ్య, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

చౌక డిపో డీలర్లు సక్రమంగా పని చేయాలి

పెదకూరపాడు, ఆగస్టు 6: చౌక డిపో డీలర్లు సక్రమంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని తహసీల్దార్ డానియేలు అన్నారు. పెదకూరపాడులోని రైతుభరోసా కేంద్రంలో మంగళవారం మండలంలోని చౌక డిపో డీలర్లతో తహసీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను చౌక డిపో డీలర్లు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మల కృష్ణ, అమరయ్య, పసుపులేటి ఆంజనేయులు, కోటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

మాదలలో పశు వైద్య శిబిరం

ముప్పాళ్ళ, ఆగస్టు 6 : మండలంలోని మాదలలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ బాల శంకరరావు మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భ కోశ వ్యాధులను నివారించి పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. వైద్య శిబిరంలో 72 పశువులకు గర్భకోశ సంబంధిత సాధారణ వ్యాధులకు చికిత్సను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంసీహెచ్ నరసింహులు, డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్ వీ శ్రీనివాసరావు, డాక్టర్ వీ కరుణాకరరెడ్డి, డాక్టర్ చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ ఎం పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తహసీల్దార్‌ను కోరిన కూటమి నేతలు



తహసీల్దార్ నగేష్‌కు అభినందనలు తెలుపుతున్న కూటమి నేతలు

గురజాలటౌన్, ఆగస్టు 6: గురజాల మండల పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ నగేష్‌ను కూటమి నేతలు కోరారు. నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నగేష్‌ను మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో కూటమి నేతలు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలపరిధిలో రెవెన్యూ పరమైన సమస్యలేవైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ స్థల దాత జగన్నాధరావుకు నివాళి

పెదకూరపాడు, ఆగస్టు 6 : హైస్కూల్ అభివృద్ధికి తమ కుటుంబ సభ్యుల ద్వారా సహకార మందిస్తామని జడ్పీ హైస్కూల్ స్థల దాత వంకా జగన్నాధరావు కుమారుడు బాలశివ గురునాథరావు, డాక్టర్ బాలశివ నరసింహారావులు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్ స్థల దాత విద్యాభివృద్ధికి కృషి చేసిన వంకా జగన్నాధరావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభదిన్ భోజన్‌ను విద్యార్థులకు వంకా కుటుంబసభ్యులు అందించారు. కార్యక్రమంలో వంకా వెంకటలక్ష్మీ నరసింహారావు, రాజ్యలక్ష్మీ, రఘురామయ్య, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్

పిడుగురాళ్ల, ఆగస్టు 6: స్థానికంగా ఉన్న భూసమస్యలు, వ్యవసాయంపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా జేసీ ధనుంజయ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు వ్యవసాయంపై రైతులకు మరింత అవగాహన కల్పించే విధంగా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. నడికూడి - బీబీనగర్ డబుల్ లైన్, కొండమోడు - పేరేచర్ల నాలుగు లైన్ల విస్తరణ పనులకు సంబంధించి భూసేకరణ, కౌలురైతు కార్డులు, రేషన్‌కార్డుల పంపిణీపై ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనవేళ పంటల సాగు, దిగుబడులపై రైతులకు సరైన అవగాహన కల్పించే విధంగా ఉండాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెల నిర్మాణ పనులు చేపట్టాలి



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డితో వరికపూడిశెల జలసాధన సమితి సభ్యులు

వెల్దుర్తి, ఆగస్టు 6: మండల పరిధిలో వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని వరికపూడిశెల జల సాధన సమితి సభ్యులు కోరారు. మంగళవారం వెల్దుర్తిలోని టీడీపీ కార్యాలయంలో వారు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కలిసి వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.80 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బత్తుల వీరయ్య యాదవ్, ఇస్లా వత్ హనుమంతునాయక్, కోనంకి సాంబయ్య యాదవ్, ఆరుమూళ్ల రమేష్ తదితరులు ఉన్నారు.

విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీలు



విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 6: పట్టణంలోని పురుగుమందులు, విత్తన దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పలు షాపుల్లో అనుమతులు లేని సరుకులను గుర్తించి వాటి అమ్మకాలను నిలిపివేయించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో స్థానిక వ్యవసాయ అధికారులు వెంకటలక్ష్మి ఏజెన్సీస్, పెస్టిసైడ్స్ దుకాణంలో కాలం చెల్లి ఉన్న పురుగుమందులను నిల్వ ఉంచి అమ్మచూపుతున్నందున, రికార్డులు సక్రమంగా లేనందున రూ.12,400 విలువ కలిగిన 4 లీటర్ల పురుగుమందులను జప్తుచేసి కేసు నమోదు చేశారు. అదేవిధంగా మణికంఠ సీడ్స్ షాపులో సోర్స్ సర్టిఫికెట్ లేకుండా 210 కేజీల కంది విత్తనాలు 79,800 రూపాయల విలువ కలిగినవి ఉండటాన్ని గుర్తించారు. ఆయా షాపుల్లో మొత్తం రూ.92,200ల విలువ కలిగిన విత్తనాలు, పురుగుమందుల అమ్మకాలకు స్టాప్ సేల్ నోటీసులను అధికారులకు ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి రమణకుమార్, స్థానిక ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి అంబేద్కర్ పేరు

● కన్నెగంటి రాష్ట్ర రహదారిగా నామకరణం : ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 6: పిడుగురాళ్ల సమీపంలో కొత్తగా నిర్మాణంలో వున్న మెడికల్ కళాశాలకు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పేరును ఎమ్మెల్యే యరపతినేని సూచించారు. అలాగే అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేకు పుల్లరి వీరుడు కన్నె గంటి హనుమంతు పేరును పెట్టనున్నట్లు వెల్లడించారు.

త్యాగమూర్తుల పేర్లు పెట్టడం గర్వకారణం

దాచేపల్లి, ఆగస్టు 6: పల్నాటి ప్రాంతంలో అభివృద్ధి పనులకు త్యాగమూర్తుల పేర్లు పెట్టాలని ఎమ్మెల్యే యరపతినేని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని దాచేపల్లి మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

కన్నా జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలి

సత్తెనపల్లి, ఆగస్టు 6: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలను ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పట్టణంలో నిర్వహించనున్నట్లు టీడీపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం టీడీపీ ప్రజావేదికలో జన్మదిన వేడుకలకు సంబంధించిన కరపత్రాలను గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎలినేడి రామస్వామి, పలువురు టీడీపీ నేతలు, జనసేన, బీజేపీ నేతలు ఆవిష్కరించారు.

మాచర్ల తహసీల్దార్‌గా జియా ఉల్ హక్



జియా ఉల్ హక్

మాచర్లటౌన్, ఆగస్టు 6: మాచర్ల మండల తహసీల్దార్‌గా జియా ఉల్ హక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన క్రోసూరు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉల్ హక్‌కు డీటీ శ్రీనివాసరావుతోపాటు ఆర్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ సాల్మన్‌రాజు, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలిలు అభినందనలు తెలిపారు.

స.హ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

క్రోసూరు, ఆగస్టు 6 : సమాచార హక్కు చట్టంపై ప్రజలతో పాటు అధికారులు కూడా అవగాహన కలిగి ఉండాలని సీనియర్ ఉపాధ్యాయుడు సదాశివరెడ్డి అన్నారు. మంగళవారం క్రోసూరులో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారి తనం తీసుకు రావటం కోసం సమాచార హక్కు చట్టాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. మన దేశంలో జమ్ము కాశ్మీర్ మినహా అన్ని రాష్ట్రాల్లో సమాచార హక్కు చట్టం అమల్లో ఉందన్నారు. సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని కోరదలచుకున్న వారు ఇంగ్లిషులో గాని, మాతృ భాషలో గాని, రాత పూర్వకంగా, ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా నిర్ణీత రుసుముతో అభ్యర్థనను పౌర, సమాచార అధికారికి సమర్పించాల్సి ఉంటుంద న్నారు. ముద్రించిన లేదా టెస్ట్ రూపంలో పంపినా ప్రతి కాపికి పేజికి రూ.2 చొప్పున, ఫ్లాపీల కైతే రూ.50 చొప్పున, డీడీకి వంద రూపాయలు, డీవీడీకి రూ 200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, నీటి పారుదల, రెవెన్యూ, మార్కెటింగ్‌తో పాటు పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై అధికారులు శ్రద్ధ వహించాలి

● ఏడీఏ హనుమంతరావు

క్రోసూరు, ఆగస్టు 6: క్రోసూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండ లాల్లో ఈ పంట నమోదు పై వ్యవసాయ, రెవెన్యూ అధికారులు శ్రద్ధ వహించాలని క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వీ హనుమంతరావు అన్నారు. మంగళవారం క్రోసూరు రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు పై వ్యవసాయ, రెవెన్యూ శాఖల వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2024 - 25 ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ పంట యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. రైతులు వేసిన పంటలు ఈ క్రాపులో నమోదైతే ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే సంక్షేమ పథకాలు, పంటల బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రభుత్వం మద్దతు ధరలకు దిగుబడుల కొనుగోలు, ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు మొదలైనవి రైతులకు అందించబడతాయన్నారు. పంట సాగుదారు హక్కుపత్రం పొందిన కౌలు రైతులకు కూడా ఇవే ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, ఇరిగేషన్ ఏఈ, గణాంక అధికారి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



స్టేడియంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

స్టేడియంలో వర్షం నీటిని బయటకు పంపాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 6: పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో వర్షం నీటిని తక్షణమే బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నరసరావుపేట డాక్టర్ కోడెల శివప్రసారావు స్టేడియంలో వర్షం నీరు నిలిచిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టేడియంలో వాతావరణం ఇలా ఉంటే క్రీడాకారులకు ఇబ్బందికరంగా ఉండదా అని ప్రశ్నించారు. నీరు నిలిచే ప్రాంతాలను చదును చేయాలన్నారు. గత ప్రభుత్వం క్రీడాకారుల గురించి కనీసం పట్టించుకోకపోవడం కారణంగానే స్టేడియంలో ప్రస్తుతం ఇలాంటి దుస్థితి దాపురించిందన్నారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించే బాధ్యత తానుతీసుకుంటానన్నారు. కార్యక్రమంలో సి.బాలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 6: ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 12, 15, 17, 22, 31 వార్డులలో మున్సిపల్ కార్మికులతో కలిసి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వీధులలో తిరిగి కాలువలు శుభ్రం చేశారు. పలు ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను పారతో ఎత్తారు. అనంతరం అరవిందబాబు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవడం ద్వారా మాత్రమే ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పారిశుధ్యాన్ని గాలికి వదిలేశారని, వారి చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగానే ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలలో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధులు లేకుండా దోచుకున్నారన్నారు. జేబులు నింపుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై కనీసం కూడా పెట్టలేదన్నారు. ఎంతోచేశానని చెప్పుకునే జగన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నరసరావుపేటకు ఏంచేశారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ కార్మికులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఎమ్మెల్యే



జేసీ సూరజ్‌కుమార్‌తో ఎమ్మెల్యే

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సూరజ్ కుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో అభివృద్ధి, సమస్యల గురించి చర్చించారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి విషయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని, ప్రభుత్వపరంగా మద్దతు ఇవ్వాలని అన్నారు. ప్రధానంగా వ్యాధుల విజృంభణ ఎక్కువగా ఉన్నందున అధికారులను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఎమ్మెల్యే అరవిందబాబును కలిసిన తహసీల్దార్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 6: నరసరావుపేట నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కే వేణుగోపాలరావు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై చట్టపరంగానే కాకుండా మానవతా దృక్పథంతో స్పందించాలని సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన మాటల మేరకు పనిచేయాలని కోరారు. ప్రభుత్వపరంగా కావాల్సిన మద్దతు, సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

● విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 6: నేషనల్స్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో జరగనున్న పరీక్షకోసం రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సరాదాయం రూ. 3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ ఏడాది డిసెంబరు 8న ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 దరఖాస్తులను ఆన్ లైన్‌లో ఆగస్టు 5 నుంచి స్వీకరిస్తున్నామని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ సెప్టెంబరు 6వ తేదీ అన్నారు. పరీక్ష రుసుము చెల్లించేందుకు చివరి తేదీ సెప్టెంబరు 10అని, పరీక్ష రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లోని ఎస్‌బీఐ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. అదనపు సమాచారం కోసం ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో లేదా పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంను సంప్రదించాలన్నారు.

కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి నగదు జమ

రొంపిచర్ల, ఆగస్టు 6: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడి వందలమంది మరణించారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి వయనాడ్ ప్రజలను ఆదుకోవాలని రొంపిచర్ల భగత్‌సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం డిమాండ్ చేశారు. దాతల నుంచి సేకరించిన రూ.45వేల విరాళాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి బ్యాంక్ ద్వారా నగదు జమ చేశారు. ఈ సందర్భంగా సరికొండ రామకృష్ణంరాజు మాట్లాడుతూ వరదతో వయనాడ్ అతలాకుతలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాపనయ్యనగర్ పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌పాల్ డిమాండ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 6: బాపనయ్య నగర్‌లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ డిమాండ్ చేశారు. మంగళవారం 12వ వార్డులో జరిగే శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ బాపనయ్య నగర్ గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. 2014లో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని ఉంటున్న వారికి రోడ్లు వీధిలైట్లు, కొన్ని ఇళ్లకు కరెంట్ మీటర్లు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం క్రమబద్ధీకరణ పేరిట ప్రభుత్వ స్థలాలలో నివాసం ఉండే వారికి సర్వేచేసి ఒక రూపాయికే రిజిస్ట్రేషన్ చేయమని అధికారులు ఆదేశాలు ఇచ్చినప్పటికి కనీసం సర్వేకు కూడా నోచుకోలేదన్నారు. కాగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జిల్లా కలెక్టర్‌కు కూడా వినతిపత్రం ఇవ్వాలని, దీనిపై పరిశీలించి తగిన న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ వెంకటరావు, కుంభ బ్రహ్మయ్య, గోదా నీలాంబరం, బాపనయ్య, స్థానికులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో నకిలీ విత్తనాలను అరికట్టాలి

● ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి మోహన్‌చంద్

శావల్యాపురం, ఆగస్టు 6: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున విత్తన వ్యాపారులు, దళారులు కొందరు లాభార్జనే ధ్యేయంగా రైతులను మభ్యపెట్టి విత్తనాలను బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు అమ్ముకొంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి అధికారులతో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించి అక్రమాలకు తావులేకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు షాపు యజమానుల నుంచి తప్పకుండా బిల్లులు తీసుకోవాలని, విత్తనాల సంచులను కూడా భద్రపరచుకోవాలన్నారు. సాగర్ ఆయకట్టుకు ప్రభుత్వం సాగు నీరు విడుదల చేస్తున్నందున గ్రామాలలో సర్వేలు నిర్వహించి రైతులకు కావలసిన విత్తనాలను కొరత లేకుండా సకాలంలో వారికి రాయితీలపై అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష కోట్లు దోచుకోవడం తప్ప

జగన్ ప్రజలకు చేసిందేమీలేదు

● 15నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభం
● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు

వినుకొండ టౌన్, ఆగస్టు 6: లక్ష కోట్లు అవినీతితో దోచుకోవడం తప్ప రాష్ట్ర ప్రజలకు మాజీ సీఎం జగన్మోహనరెడ్డి చేసింది ఏమీలేదని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో తల్లీ, పిల్లల వైద్యశాల వద్ద గల అన్న క్యాంటీన్ భవనాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి నాగశ్రీను రాయల్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకుండా వదిలేశారని, రాష్ట్రంలోని తాగునీటి ప్రాజెక్టులన్నింటినీ అటకెక్కించారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలన్నీ మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ద్వారా లక్షలమంది పేదల ఆకలితీర్చితే, వాటిని కూడా స్వార్థ, కక్షపూరిత రాజకీయాలకు బలిపెట్టిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని జీవీ ధ్వజమెత్తారు. అన్న క్యాంటీన్లకు వైస్ ఫోటోలుపెట్టి మరీ వాటిని మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5కే కడుపునిండా భోజనం తింటున్న పేదల పొట్టకొట్టిన జగన్ తన కడుపుమంటను చల్లార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్లతో పాటు, ఏ సంక్షేమ పథకాన్ని వాడుకోవడానికి ఇష్టపడని జగన్ ఎంతోమంది ఉసురు పోసుకున్నారని ఆయన మండిపడ్డారు. వినుకొండ నడిబొడ్డున అన్న క్యాంటీన్ మూసివేయడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించి, పేదలకు రూ.5కే కడుపునిండా భోజనం అందిస్తామని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి లాభాపేక్షలేకుండా నాణ్యతా ప్రమాణాలతో పౌష్టిక ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. తల్లీ, పిల్లల వైద్యశాల వద్ద గల అన్న క్యాంటీన్ భవనం తాజా పరిస్థితి, ఫర్నీచర్, ఐఓటీ, పరికరాల ఏర్పాటు గురించి మున్సిపల్ డీఈ వెంకయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షమీమ్‌ఖాన్, పఠాన్ అయుబ్ ఖాన్, పత్తిపూర్ణ, పి.వి సుఃకరేష్‌బ కుమార్, అజీజ్, కర్నాటి వెంకటరెడ్డి , పల్లమీసాల దాసయ్య, గందం సుబ్బారావు, చికెన్ బాబు, గుంజరి కాళంగిరాజు, నరసింహరావు, టీడీపీ, జనసేన. బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

వినుకొండ, ఆగస్టు 6: మండలంలోని తిమ్మాయిపాలెంలో ఇటీవల ప్రమాదవశాత్తు పొగాకు కొష్టాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీనిగురించి తెలుసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తిమ్మాయిపాలెం గ్రామానికి చేరుకుని అగ్నిబాధితులను మంగళవారం పరామర్శించారు. శివశక్తి లీలా, అంజన్ ఫౌండేషన్ ద్వారా బాధితులైన లగడపాటి సత్యం, చిన్న సుబ్బారావు, పెద్ద సుబ్బారావు, గాలయ్యలకు ఆర్థికసాయం అందించారు. రైతులకు ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, గోవిందరాజులు, డీసీ కొండలు, కొత్తపాలెం నర్సయ్య ఏకాంబరం, అడపాల రామయ్య, యాదగిరి రామయ్యతో పాటు గ్రామ తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దుదాం

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 6: పల్నాడు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దుదామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ - డీసీపీయూ సారధ్యంలో బాలలు - మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలు గురించి జిల్లాలో పనిచేస్తున్న కీలక ముఖ్య శాఖలైన పోలీసు శాఖ, విద్యా శాఖ, ఎక్సైజ్ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ తదితర శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులతో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమీక్ష ర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు ద్వారా పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం అధ్యక్షతన జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు, సమన్వయం, ఉమ్మడి భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి విస్తృత చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే చేపట్టవలసిన నియంత్రణ చర్యలు వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ షాపులు, మద్యం దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైల్వే పోలీస్ వారు తప్పిపోయిన, వదిలివేయబడిన బాలబాలికలను బాలల సంక్షేమ కమిటీ వారి ముందు ప్రవేశపెట్టి వారికి సంబంధించిన విషయాలను వెబ్‌సైట్ ద్వారా మిగిలిన అన్ని స్టేషన్స్‌కు తెలియజేయాలని కమిషన్ సభ్యులు పద్మావతి ఆదేశించారు. రైల్వే శాఖాధికారులు గవర్నమెంట్, రైల్వే పోలీసు అధికారుల సమన్వయంతో పిల్లలతో మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వ్యక్తుల మూలాలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖాధికారులు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల పిల్లల భవిష్యత్ ఏ విధంగా ఛిద్రం అవుతుందో డాక్యుమెంటరీలు రూపంలో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.



పూడిక తొలగించి రోడ్డుపై వదిలిన వ్యర్థాలు

పూడిక తీశారు.. తొలగింపు మరిచారు

నరసరావుపేట, ఆగస్టు 2: నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో వరద నీటి కాలువల్లో ఇటీవల పూడికతీసి ప్రధాన రహదారిపై పడేశారు. పది రోజులు గడుస్తున్నా పూడిక మట్టిని తొలగింపును మునిసిపాల్టీ విస్మరించింది. దీంతో వర్షాలకు ఈ మట్టి, వ్యర్థాలు తిరిగి కాలువలోకి చేరుతున్నాయి. పూడికతీతకు వెచ్చించిన నిధులు నిరుపయోగమతున్నాయి. భారీగా పూడికమట్టి, వ్యర్థాలు రోడ్డుకు అడ్డుగా వేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా వీటిని తొలగించేందుకు పురపాలకులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వాల్వ్ వద్ద వృథాగా పోతున్న నీరు, ఆర్బి వద్ద జలమయమైన వీధి

తాగు నీరు వృథా

నరసరావుపేట, ఆగస్టు 2: పట్టణంలో తాగు నీరు వృథా అవుతోంది. వృథాను అరికట్టడంతో మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పల్నాడు రోడ్డులోని కేఆర్ కళాశాల ప్రాంతంలో పైపులైన్ వాల్వ్ నుంచి నిత్యం పెద్ద ఎత్తున తాగు నీరు వృథా అవుతోంది. దీనిని నివారించే చర్యలు చేపట్టడం లేదు. పల్నాడు రోడ్డులోని ఆర్బి సమీపంలో పైపులైన్‌పై లీకు ఏర్పడింది. దీనివల్ల తాగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా మునిసిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నీటి వృథాను అరికట్టాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. పైపులైన్ లీకు వలన తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

మొలక శాతాన్ని బట్టి వడ్లను విత్తనాలుగా వాడుకోవచ్చు

● లాంఫామ్ రిటైర్డ్ శాస్త్రవేత్త ఈదర వెంకటేశ్వర్లు

వినుకొండ, ఆగస్టు 6: వరి పంటను పండించే రైతులకు మార్కెట్‌లో జేజీఎల్ 384 రకం విత్తనం కొరత ఏర్పడిన నేపథ్యంలో, గతంలో రైతుల సాగుచేసిన జేజీఎల్ 384 రకం వడ్లు రైతుల వద్ద అందుబాటులో ఉంటే, మొలకశాతం నిర్ధారణ చేసుకుని (80శాతం మొలకలు తగ్గకుండా ఉంటే) విత్తనంగా వాడుకోవచ్చని లాంఫామ్ రిటైర్డ్ శాస్త్రవేత్త ఈదర వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. రైతులు జేజీఎల్ 384 రకంతో పాటుగా ఎంటీయూ 1224, ఎస్.ఎల్.ఆర్ 34449, ఎస్.ఎల్.ఆర్ 3041, ఎస్.ఎల్.ఆర్4001రకాలు కూడా సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. వరి ఎకరా పంటగా సాగుచేసే రైతులు (దీర్ఘకాలిక రకాలు) 160 రోజుల కాల పరిమితి కలిగిన బీపీటీ 2270, బీపీటీ 2295కూడా సాగు చేసుకోవచ్చని, సన్న గింజతో దిగుబడి అధికంగా ఉంటాయని, రైతులు స్థానికంగా మార్కెటింగు సౌకర్యం చూసుకుని, ఈ రకాలు ఎంచుకోవాలని తెలిపారు.

మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన

నరసరావుపేట లీగల్ 6: జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పెద్ద చెరువులోని కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయంలో మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి టి.ప్రవళిక మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం ఆరోగ్యానికి హానికరం అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని, ఇవి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఎంతో ప్రమాదకరమన్నారు. మత్తు పదార్థాలు అలవాటుగా కలిగిన వారిని రీహాబిలిటేషన్ సెంటర్‌కు పంపి సన్మార్గంలో నడిచేలా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం పంపిణీ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 2: పట్టణంలోని హాండ్స్ ఆఫ్ కంప్రెషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన సహృదయ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో హెచ్ఐవీతో జీవిస్తున్న 25మందికి మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏసీ డీపీవో మాణిక్యరావు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీఐతో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం చాలా అవసరం అన్నారు. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ బారినపడిన వారికి ఊపిరితిత్తుల వ్యాధులు త్వరగా వస్తాయని, సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, ఆగస్టు 6: మండలంలోని బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం ప్రాథమిక పాఠశాల్లో స్టాప్ డయేరియాపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ రామ్‌నాయక్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం చేతులు పరిశుభ్రంగా ఉంచుకొనటంపై తెలియచేశారు. అనంతరం బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో పిల్లల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాబునాయక్, జాయి బాబు, ఆర్‌సీ ప్రభాకర్, సైదమ్మ, 104 సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేపల చెరువు వ్యవహారంలో స్వల్ప వివాదం

కనమర్లపూడి (శావల్యాపురం) ఆగస్టు 6: మండలంలోని కనమర్లపూడిలో చేపలచెరువు వ్యవహారంలో గ్రామస్థులకు, కాంట్రాక్టర్‌కు మధ్య మంగళవారం స్వల్పవివాదం జరిగింది. చేపలచెరువు విషయంలో గతంలో చేసుకొన్న ఒప్పందం ప్రకారం నడుచుకోవాలని కాంట్రాక్టర్‌ను గ్రామస్థులు కోరగా దానికి కాంట్రాక్టర్ నిరాకరించడంతో ఘర్షణ మొదలైంది. చేపలచెరువులోని నీటితో కొంతమంది గ్రామస్థులు ప్రక్కనే ఉన్న పొలాల్లో వరి నార్లు పోసుకొన్నారు. చెరువులో చేపలు పట్టుకునేందుకు కాంట్రాక్టర్ నీటిని తొలగిస్తాననడంతో గ్రామస్థులు నిరాకరించారు. ఈ వివాదం మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరటంతో ఇరువర్గాల వారితో పోలీసులు మంతనాలు జరిపారు.

ఆల్ ఇండియా ఆదివాసీ సంఘీభావ సదస్సు

వినుకొండ, ఆగస్టు 6: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో ఈ నెల 9, 10న జరిగే ఆల్ ఇండియా ఆదివాసీ సంఘీభావ సదస్సును విజయవంతం చేయాలని పీడీఎం నాయకులు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆదివాసీ సంఘీభావ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నూజెండ్ల, ఆగస్టు 6: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి మంగళవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తల్లిపాల వారోత్సవాలు

నూజెండ్ల, ఆగస్టు 6: మండలంలోని వీ అప్పాపురంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్ వైజర్ ఎం శివ నాగలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహారం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుందరమ్మ, ఆయా దయమ్మ పాల్గొన్నారు.



చెంఘీజ్‌ఖాన్‌పేటలో మహిళా రైతులతో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ రామచంద్ర, డీపీఎం అమలకుమారి

అంతర పంటల సాగుతో రైతులకు మేలు

యడ్లపాడు, ఆగస్టు 6: ప్రత్తిలో అంతర పంటలను సాగుచేయడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి పేర్కొన్నారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ రామచంద్రతో కలసి మండలంలోని ఉన్నవ, సొలస గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం, ఏటీఎం విధానంలో సాగుచేస్తున్న పొలాలను ఆమె సందర్శించారు. మహిళా రైతులతో ముచ్చటించి వారు సాగులో పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ప్రత్తిలో సాలుకి సాలుకి మధ్య అంతర పంటలుగా బెండ, గోరుచిక్కుడు, అనుములు, పెసర, సజ్జ, కంది వంటి వాటిని వేసుకోవాలన్నారు. అలాగే సస్య రక్షణకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు, కషాయాలు తయారుచేసుకోవడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా రైతు జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబరు 15లోగా ఈ పంట నమోదు పూర్తి చేయాలి

● మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత

యడ్లపాడు, ఆగస్టు 6: ఈ పంట నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబరు 15వ తేదీ లోగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత అన్నారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టం, ఈ పంట నమోదుపై రైతులకు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ పంట నమోదులో వాస్తవ సాగుదారుని వివరాలు మాత్రమే నమోదు చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి సాగుచేసిన పంట వివరాలను నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. పంట నమోదుకు సిబ్బందికి సహకరించాలని కోరారు. సమాచార హక్కు చట్టం కింద పౌరులు తాము కోరుకున్న సమాచారాన్ని పొందే హక్కు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.




శావల్యాపురంలో మాట్లాడుతున్న డీఎంవో రవీంద్ర రత్నాకర్

సీజనల్ వ్యాధుల నివారణకు సహకరించాలి

● జిల్లా మలేరియా యూనిట్ అధికారి రవీంద్ర రత్నాకర్

శావల్యాపురం, ఆగస్టు 6: సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజలంతా తమవంతు సహకారం అందించాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. ఆశాడే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి దోమల నివారణ చర్యలపై ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైనందున ప్రజలు ఇంటి పరిసరాలు, పూలకుండీలు, పాత సామాగ్రిలో నిల్వనీరు లేకుండా చేసుకోవాలని, నిల్వనీటిలో దోమలు లార్వాలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల ప్రజలకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలు రావడం జరుగుతుందన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి దోమలు గుడ్లుపెట్టే ప్రదేశాలు గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నారన్నారు. ఇళ్ళముందు మురికి కాలువల్లో చెత్తచెదారం వేయకుండా ఎప్పటికప్పుడు శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. వైద్యాధికారులు మాన్యం రాధాకృష్ణన్, రావిపూడి రమ్య, సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, వినుకొండ మలేరియా సూపర్‌వైజర్ బాలస్వామి, స్టాఫ్‌నర్సు లక్ష్మీప్రసన్న, ల్యాబ్ టెక్నీషియన్లు సీతారామయ్య, సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సంతగుడిపాడు రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు

సంతగుడిపాడు రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

రొంపిచర్ల, ఆగస్టు 6: మండలంలోని సంతగుడిపాడు రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఉన్నాయంటూ సమాచారం రావటంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. జిల్లా అధికారులకు అందిన సమాచారం మేరకు తనిఖీలు జరిగాయి. విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి తమ సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. ఐతే మిల్లులో అక్రమ రేషన్ ఏమీ పట్టుబడ లేదు. దాడుల్లో సివిల్ సప్లయిస్ డీటీ కొండారెడ్డి పాల్గొన్నారు.



ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు

45 మందికి ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ల అందజేత

నాదెండ్ల, ఆగస్టు 6: మండలంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. ఈ పరీక్షకు 45మంది హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరుకు చెందిన 25ఏ ఎన్‌సీసీ బెటాలియన్ నుంచి హవల్దార్ మేజరు బలివీర్‌సింగ్, హవల్దార్ చిరంజీవిలు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఐ కృష్ణానాయక్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణ పెంచుతుందని, భావి భారతపౌరులుగా తీర్చిదిద్దటానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మహమ్మద్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌సాహెబ్‌పాలెంలో కంటి వైద్య శిబిరం

నాదెండ్ల, ఆగస్టు 6: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన ఎంవీ రెడ్డి కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. 60మంది శుక్లాలు ఉన్న వారిగా, 28మందికి కళ్ళ జోళ్ళు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ శిబిరాన్ని పర్యవేక్షించిన వారిలో పీఆర్‌వో దిలీప్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావులు ఉన్నారు.